Digital, tmedia.net.in

# టీ-మీడియా

మెయిన్ ఎడిషన్

సామాజికం.. ప్రజల పక్షం...

సంపుటి : 8
సంచిక : 329
పేజీలు : 3
శనివారం 04.07.2026

GSTIN: 36FDKPS1308P1ZX | Analytics ID: UA-194163459
Domain ID : DC7812B9B3101414BB98847D724E48B3A-IN

ఎడిటర్ : శనగపాటి మురళీకృష్ణ

## మోదీ 3 దేశాల టూర్ ఖరారు

- 40ఏళ్లలో తొలిసారి న్యూజిలాండ్‌లో పర్యటన

**టి మీడియా ,జూలై 3, ఢిల్లీ బ్యూరో :**




ప్రధాని నరేంద్ర మోదీ ఈ నెల 6 నుంచి 11 వరకు ఇండోనేషియా, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్‌లో పర్యటించనున్నారు. ఈ 3 దేశాలతో ద్వైపాక్షిక సంబంధాలను మరింత బలోపేతం చేసుకునే దిశగా మోదీ ఈ పర్యటన చేయనున్నారని విదేశాంగ మంత్రిత్వ శాఖ వెల్లడించింది. ఈ పర్యటనలో భాగంగా ప్రధాని మోదీ తొలుత ఇండోనేషియా వెళ్తారు. ఆ తర్వాత ఆస్ట్రేలియాలో పర్యటిస్తారు. ఆస్ట్రేలియా పర్యటనలో మోదీ ప్రధాన కార్యక్రమాలన్నీ మెల్‌బోర్న్ నగరంలో జరగనున్నాయి. చివరిగా ఆయన న్యూజిలాండ్ సందర్శనతో మూడు దేశాల పర్యటన ముగుస్తుంది. దాదాపు 40 ఏళ్ల తర్వాత భారత ప్రధాని న్యూజిలాండ్‌లో పర్యటించనున్నారు. అందుకే ఈ పర్యటన అత్యంత ప్రత్యేకమని విదేశాంగ శాఖ పేర్కొంది. ప్రధాని నరేంద్ర మోదీ వచ్చే వారం తమ దేశానికి రానున్నారని న్యూజిలాండ్ ప్రధాని క్రిస్టోఫర్ లక్సన్ అంతకుముందు రోజు ఎక్స్ మాధ్యమంలో ప్రకటించారు. ప్రపంచంలోనే అతిపెద్ద, అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థల్లో భారత్ ఒకటని లక్సన్ కొనియాడారు. న్యూజిలాండ్ ఆర్థిక శ్రేయస్సుకు భారత్ ఎంతో ముఖ్యమైనదని పేర్కొన్నారు.

# యూరియా స్కామ్ బట్టబయలు..

- రైతు సేవా కేంద్రాలే అవినీతికి అడ్డా






**టి మీడియా ,జూలై 3 ,సిద్దిపేట:** సిద్దిపేట జిల్లాలో యూరియా పంపిణీలో వరుస అక్రమాలు కలకలం రేపుతున్నాయి. రైతన్నకు అండగా ఉండాల్సిన కొన్ని రైతు సేవా కేంద్రాలే అవినీతికి అడ్డాగా మారుతున్నాయి. నిన్న చేర్యాల.. నేడు బైరాన్‌పల్లి.. ఇలా రోజుకో చోట యూరియా బస్తాలు మాయమవుతూనే ఉన్నాయి. అధికారుల నిఘా లోపమో.. లేక వ్యాపారుల తెగింపో గానీ.. క్షేత్రస్థాయిలో రైతులకు మాత్రం ఎరువులు దక్కకుండా పోతున్నాయి. పూర్తి వివరాల్లోకి వెళ్తే సిద్దిపేట జిల్లాలో యూరియా మాఫియా రెచ్చిపోతోంది. ధూల్మిట్ట మండలం కూటిగల్ గ్రామానికి చెందిన కుమార్ అనే రైతుకు ప్రభుత్వం కేటాయించిన 18 యూరియా బస్తాలను ఓ కేంద్ర నిర్వాహకుడు నొక్కేసాడు.అన్నదాతకు చెందాల్సిన ఎరువులను కాసులకు కక్కుర్తి పడి పక్కదారి పట్టిస్తున్నారు కొందరు కేటుగాళ్లు.ప్రభుత్వం పారదర్శకత కోసం తీసుకొచ్చిన యాప్‌లోనే ఈ వ్యాపారుల బాగోతం బట్టబయలవుతోంది.చేర్యాలలో వేల బస్తాల యూరియా మాయం ఘటన మరువక ముందే.. బైరాన్‌పల్లి గ్రామంలో మరో దందా వెలుగుచూసింది. చేర్యాలలో ఏకంగా 6,429 యూరియా బస్తాలు మాయమైన ఘటన జిల్లా వ్యాప్తంగా సంచలనం సృష్టించింది. ఈ పెద్ద స్కామ్ మరువక ముందే.. బైరాన్‌పల్లి రైతు సేవా కేంద్రంలో మరో దందా బయటపడింది. అయితే ఈ దందాను ప్రభుత్వం తీసుకొచ్చిన కొత్త టెక్నాలజీయే బట్టబయలు చేసింది.రైతు కుమార్ అసలు యూరియా బుక్ చేసి తీసుకోకపోయినా.. తీసుకున్నట్టు ఆయన మొబైల్‌కు మెసేజ్ వచ్చింది. అది చూసి షాకైన సదరు రైతు.. ఇదేంటని రైతు సేవా కేంద్రం యజమానిని నిలదీశాడు. దానికి ఆ యజమాని బాధ్యతారాహిత్యంగా, నిర్లక్ష్యంగా సమాధానం చెప్పడం గమనార్హం. ఉన్నతాధికారులు చర్యలు తీసుకుంటున్నా.. గ్రౌండ్ లెవెల్‌లో యూరియా మాఫియా ఆగడం లేదనడానికి ఈ ఘటనే నిదర్శనం. సాంకేతికత సాయంతో అక్రమార్కుల ఆటలు బయటపడుతున్నా.. క్షేత్రస్థాయిలో అక్రమాలు ఆగకపోవడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. సిద్దిపేట జిల్లాలో జరుగుతున్న ఈ యూరియా దందాపై ఉన్నతాధికారులు మరింత కఠినంగా వ్యవహరించాలని, బాధ్యులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

### 4వ విడత రైతు భరోసాగా

# రూ.1188 కోట్లు విడుదల



**టి మీడియా ,జూలై 3 ,హైదరాబాద్ బ్యూరో :**
తెలంగాణ రాష్ట్రంలోని రైతాంగానికి ప్రభుత్వం సాగు పెట్టుబడి సాయంగా పెద్ద ఊరటనిచ్చింది. రైతు భరోసా పథకానికి సంబంధించి నాలుగో విడత నిధులను ప్రభుత్వం అధికారికంగా విడుదల చేసింది. ఐదు ఎకరాల వరకు సాగుభూమి కలిగిన అర్హులైన రైతులందరికీ ఈ విడతలో డబ్బులు నేరుగా వారి ఖాతాల్లోనే జమ చేసినట్లు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వెల్లడించారు. తాజా విడత ద్వారా రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 4.41 లక్షల మంది అన్నదాతల బ్యాంకు ఖాతాల్లోకి రూ. 1,188 కోట్ల భారీ మొత్తాన్ని బదిలీ చేసినట్లు ఆయన స్పష్టం చేశారు. వర్షాకాలం సాగు పనులు ఊపందుకుంటున్న ఈ సమయంలో ఈ పెట్టుబడి సాయం అందడం పట్ల రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

#### ఇప్పటివరకు రూ. 6,590 కోట్లు పంపిణీ

రాష్ట్రంలో వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చడమే కాకుండా, రైతులు అప్పులపాలు కాకుండా చూసేందుకే ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు. ఈ క్రమంలోనే ఇప్పటివరకు జరిగిన అన్ని విడతల పంపిణీ లెక్కలను ఆయన వివరించారు. ఈ పథకం ప్రారంభమైనప్పటి నుంచి ఇప్పటివరకు రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 65.76 లక్షల మంది రైతులకు రూ. 6,590.37 కోట్ల ఆర్థిక సాయాన్ని ప్రభుత్వం విజయవంతంగా అందించిందని తెలిపారు. ఎలాంటి దళారీల ప్రమేయం లేకుండా, పారదర్శకంగా లబ్ధిదారుల ఎంపిక జరిపి నిధులను క్రమం తప్పకుండా విడుదల చేస్తున్నామని, రైతు సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం మరిన్ని అడుగులు వేయబోతోందని ఈ సందర్భంగా ఆయన స్పష్టం చేశారు.

# 'టారిఫ్ బెదిరింపులతోనే భారత్

- పాక్ యుద్ధాన్ని ఆపా
- ట్రంప్ నోట మళ్లీ అదే మాట



**టి మీడియా ,జూలై 3 , ఢిల్లీ బ్యూరో :**
భారత్- పాకిస్థాన్ యుద్ధం గురించి అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మళ్లీ పాత పాటే పాడారు. టారిఫ్ హెచ్చరికతోనే రెండు అణ్వాయుధ దేశాల మధ్య యుద్ధాన్ని నిలిపివేసినట్లు ప్రకటించారు. తన అధ్యక్ష పదవీకాలంలో మొత్తం ఎనిమిది యుద్ధాలను నిలిపివేశారని, అందులో ఐదు యుద్ధాలు టారిఫ్?ల బెదిరింపుల వల్లే ఆగిపోయాయని పేర్కొన్నారు. అమెరికా మీడియా సంస్థ సీఎన్‌బీసీకి ఇచ్చిన ఇంటర్వ్యూలో ట్రంప్ మాట్లాడుతూ, ఇరాన్?పై కూడా సంచలన వ్యాఖ్యలు చేశారు. అలాగే ఏఐ, క్రిప్టోకరెన్సీ రంగాల్లో ప్రపంచానికి అమెరికా నాయకత్వం వహిస్తోందని అన్నారు.

#### '200 శాతం టారిఫ్ విధిస్తానని చెప్పా'

భారత్?, పాకిస్థాన్ మధ్య ఉద్రిక్తతలు తారస్థాయికి చేరుకున్న సమయంలో రెండు దేశాలకు ఒకే విధమైన హెచ్చరిక చేసినట్లు ట్రంప్ చెప్పారు. 'మీరు యుద్ధం కొనసాగిస్తే మీ దేశంపై 200 శాతం టారిఫ్ విధిస్తా అని భారత్?, పాకిస్థాన్‌కు చెప్పా. ఆ హెచ్చరికతోనే పరిస్థితి అదుపులోకి వచ్చింది. ఆ సమయంలో భారత్?, పాకిస్థాన్ పూర్తి స్థాయి యుద్ధానికి చేరుకున్నాయి. రెండు దేశాలు అణ్వాయుధ శక్తులు కావడంతో పరిస్థితి అత్యంత ప్రమాదకరంగా మారింది. ఘర్షణల్లో 11 యుద్ధ విమానాలను కూల్చివేశారు. ఈ యుద్ధాన్ని ఆపడం వల్ల మూడు కోట్ల మంది ప్రాణాలు కాపాడిగలిగినట్లు పాకిస్థాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్? చెప్పారు' అని ట్రంప్ వెల్లడించారు. ట్రంప్ గతంలోనూ పలుమార్లు భారత్-పాకిస్థాన్ మధ్య కాల్పుల విరమణలో అమెరికా కీలక పాత్ర పోషించిందని చెప్పినప్పటికీ, భారత్ ఆ వాదనను నిరంతరం ఖండిస్తోంది.

#### 'ఇరాన్ రాడార్లను ధ్వంసం చేశాం'

హర్మ్యూజ్?లో వాణిజ్య నౌకలపై జరిగిన దాడులకు ప్రతిస్పందనగా అమెరికా దళాలు వరుసగా మూడు రోజుల పాటు ఇరాన్?పై సైనిక చర్యలు చేపట్టాయని ట్రంప్ తెలిపారు. ఈ దాడుల్లో ఇరాన్ రాడార్ వ్యవస్థలను పలుమార్లు ధ్వంసం చేశామని, హర్మ్యూజ్?లో ప్రయాణించే చమురు ట్యాంకర్లను అమెరికా నౌకాదళం రక్షణ కల్పించిందని పేర్కొన్నారు. అమెరికా అవసరమైతే మరిన్ని చర్యలకు కూడా సిద్ధంగా ఉందని, అందుకు కావాల్సిన అన్ని సైనిక సామర్థ్యాలు తమ వద్ద ఉన్నాయని అన్నారు. హర్మ్యూజ్?లో అమెరికా నౌకాదళం కీలక పాత్ర పోషించిందని, అది సాధారణ దిగ్భంధం కాదని, ఉక్కు గోడలా పనిచేసిందని వెల్లడించారు.

#### ఇరాన్ ఆర్థిక పరిస్థితిపై వ్యాఖ్యలు

ఇరాన్ ఆర్థిక వ్యవస్థ తీవ్ర సంక్షోభంలో ఉందని ట్రంప్ ఆరోపించారు. అక్కడ ద్రవ్యోల్బణం 300 శాతానికి చేరుకుందని, దేశానికి ఆదాయం దాదాపు లేకుండా పోయిందని అన్నారు. భవిష్యత్తులో పరిస్థితులు అనుకూలిస్తే అమెరికా రైతులు పండించే మొక్కజొన్న, గోధుమలు, సోయాబీన్ వంటి ఆహార ధాన్యాలను ఇరాన్‌కు ఎగుమతి చేసే అవకాశం ఉందని కూడా పేర్కొన్నారు. ఇరాన్ సైనిక వ్యవస్థ కూడా తీవ్రంగా దెబ్బతిన్నదని, పలువురు ఉన్నత సైనికాధికారులు మరణించారని, దేశం తీవ్ర ఆర్థిక ఒత్తిడిని ఎదుర్కొంటోందని ఆయన పేర్కొన్నారు.

## త్వరలోనే రాజీవ్ యువ వికాసం

- స్వయం ఉపాధి కల్పించడమే లక్ష్యం



**టి మీడియా ,జూలై 3 ,హైదరాబాద్ బ్యూరో:** తెలంగాణలోని నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి కల్పించాలని ప్రభుత్వం గతంలోనే నిర్ణయించింది. ఈ లక్ష్యాన్ని నెరవేర్చడం కోసం రాజీవ్ యువ వికాసం పథకాన్ని ప్రవేశపెట్టింది. దీనిలో భాగంగా 2025 జూన్ 2 నుంచి అర్హులైన లబ్ధిదారులకు యూనిట్లు మంజూరు చేయాలని ప్రభుత్వం లక్ష్యాన్ని ఏర్పరచుకుంది. ఈ నేపథ్యంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ యువత నుంచి అప్లికేషన్?లు తీసుకుంది. మంజూరైన యూనిట్ల మేరకు పత్రాలను అర్హులకు పంపిణీ చేసేందుకు ప్రభుత్వం నిశ్చయించింది. కాగా చివరి క్షణంలో రుణాల విడుదల వాయిదా పడింది. దీంతో రాష్ట్రంలోని యువత నిరాశ చెందారు. అయితే తాజాగా ప్రభుత్వం ఈ పథకం అమలుపై ప్రస్తావించడంతో యువతలో ఆశలు చిగురించాయి.రాజీవ్ యువ వికాసం పథకాన్ని అమలు చేసేందుకు గ్రామీణ, పట్టణ స్థాయిలో మంజూరైన యూనిట్ల కోసం పురపాలక, మండల కమిటీ లబ్ధిదారుల ఎంపిక చేశారు. కమిటీ ఛైర్మన్‌తో పాటు సభ్యులుగా ఉన్న వివిధ కార్పొరేషన్ల ప్రతినిధులు, బ్యాంకు అధికారులు, ప్రత్యేకాధికారులు, డీఆర్‌డీఏ ప్రతినిధులు అప్లికేషన్ల పరిశీలనను పూర్తి చేశారు. ఈ సంవత్సరానికి గాను 2026-27 బడ్జెట్‌లో మరోసారి ఈ పథకానికి రూ.6 వేల కోట్లు ప్రతిపాదించారు. దీంతో ఈసారైనా నిధులను విడుదల చేస్తారా లేదా? అనే ప్రశ్నలు యువతలో మెదులుతున్నాయి.

#### చిన్న తరహా ఉపాధి యూనిట్ల పునరుద్ధరణకు

ఈ పథకంలో భాగంగా ఎంపికైన అభ్యర్థులకు రూ.50 వేల నుంచి రూ.4 లక్షల వరకు ఆర్థిక సహాయం అందుతుంది. దీనిలో బ్యాంకు రుణం కొంత, మిగిలింది వివిధ కార్పొరేషన్లు రాయితీగా అందిస్తాయి. రూ.50 వేల యూనిట్‌కు కార్పొరేషన్లు పూర్తి స్థాయిలో సాహాయం అందిస్తాయి.

#### రాయితీ వర్తింపు ఇలా

పథకంలో భాగంగా రూ.లక్షలోపు రుణం తీసుకుంటే 70 శాతం, రూ.4 లక్షలు తీసుకుంటే 60 శాతం రాయితీ వర్తిస్తుంది. అయితే ప్రభుత్వం గత సంవత్సరం తొలుత రూ.50 వేలు, రూ.1 లక్ష లోపు రుణాల పంపిణీకి అర్హులను గుర్తించింది.

#### దరఖాస్తుల వివరాలు

రూ.50 వేల లోపు రుణం కోసం 4746 యూనిట్లకు ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈబీసీ, మైనార్టీ యువత నుంచి 2,910 అప్లికేషన్లు అందాయి. లక్షలోపు రుణానికి 3,293 యూనిట్లకు 4,101 అప్లికేషన్లు వచ్చాయి.

#### వాటిని 'రాజీవ్ యువ వికాసం' కింద అమలు చేయాలి

ఈ పథకాన్ని ఉద్దేశించి ఇటీవల ఉపముఖ్యమంత్రి భట్టివిక్రమార్క ప్రస్తావించారు. సంక్షేమశాఖల పరిధిలోని స్వయం ఉపాధి కార్యక్రమాలను 'రాజీవ్ యువ వికాసం' కింద అమలు చేయాలని అధికారులకు సూచించారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లోనూ అంబేడ్కర్ విజ్ఞాన కేంద్రాల ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ విషయాలను ఇటీవల సచివాలయంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమ శాఖల సమీక్ష సమావేశంలో భాగంగా ప్రస్తావించారు. మరో వైపు స్టడీ సర్కిళ్లను బలోపేతం చేసి యూపీఎస్సీ, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల్లో శిక్షణ అందించి అభ్యర్థుల విజయ శాతాన్ని పెంచాలని సూచించారు. అంబేడ్కర్ భవనాన్ని 2027 ఏప్రిల్ 14 నాటికి ప్రారంభించేలా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.

### రూ.8.21 లక్షల కోట్లు

# అప్పులు చేసింది మీరు కాదా?

- కేసీఆర్, హరీశ్‌రావులకు భట్టి కౌంటర్ ఎటాక్

**టి మీడియా ,జూలై 3 ,హైదరాబాద్ బ్యూరో :**
రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై మాజీ మంత్రి హరీశ్ రావు అసత్య ప్రచారం చేస్తున్నారని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. సచివాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. తాము చేసిన అప్పులను, అక్రమాలను కప్పిపుచ్చుకునేందుకే కేటీఆర్, హరీశ్ రావు ఇద్దరూ ప్రజా ప్రభుత్వంపై ఎదురుదాడికి దిగుతున్నారని మండిపడ్డారు. సింగరేణి సంస్థను బీఆర్‌ఎస్ ప్రభుత్వం పదేళ్ల పాటు సంక్షోభంలోకి నెట్టిందని భట్టి విక్రమార్క ఆరోపించారు. బీఆర్‌ఎస్ నేతలు సింగరేణి ప్రాంతాల్లో తిరుగుతూ మళ్లీ అబద్ధాలు ప్రచారం చేస్తున్నారని ఆక్షేపించారు. సింగరేణి నుంచి కేజీ బొగ్గు కూడా బయటకు వెళ్లే అవకాశం లేదని చెప్తూనే గతంలో జరిగిన బొగ్గు మాయం ఆరోపణలపై తాము సీరియస్‌గా ఉన్నామని మంత్రి స్పష్టం చేశారు.

#### బీఆర్‌ఎస్ హయాంలో రూ.8.21 లక్షల కోట్ల అప్పులు



వివిధ మార్గాల ద్వారా బీఆర్‌ఎస్? ప్రభుత్వ హయాంలో రూ.8.21 లక్షల కోట్ల అప్పులు చేశారని భట్టి విక్రమార్క అన్నారు. బుకాయింపులు, అసత్యాలతో ఎన్నాళ్లు మోసం చేస్తారని మండిపడ్డారు. ఈ అప్పులపై నిత్యం మాట్లాడితే రాష్ట్రం పరువు పోతుందని వెనక్కి తగ్గామని ఆయన తెలిపారు. తమ ప్రభుత్వం వచ్చాక, వడ్డీతో కలిపి రూ.2.08 లక్షల కోట్లను చెల్లించామన్నారు. 10 వడ్డీకి కూడా కేసీఆర్ ప్రభుత్వ హయాంలో అప్పులు తెచ్చారన్నారు. వడ్డీల భారాన్ని తగ్గించేందుకు తాము అనేక చర్యలు చేపట్టినట్లు భట్టి విక్రమార్క పేర్కొన్నారు. కట్టాల్సిన వడ్డీని రూ.34 వేల కోట్ల నుంచి రూ.11 వేల కోట్లకు తగ్గించామన్నారు. రోడ్డుపై నిలబడి అడ్డగోలుగా రోజూ మాట్లాడుతున్నారని మండిపడ్డారు. సింగరేణిపై బీఆర్‌ఎస్? నేతలు అబద్ధాలను ప్రచారం చేస్తున్నారన్నారు. సింగరేణి కోల్ బ్లాక్‌లను పెంచేందుకు చిన్న ప్రయత్నమైనా చేశారా అని భట్టి ప్రశ్నించారు.

#### అవాస్తవాలు ప్రచారం చేస్తున్నారు

బీఆర్‌ఎస్? ప్రభుత్వ హయాంలో చేసిన అప్పులను కేటీఆర్, హరీశ్?రావులు తక్కువ చేసి చూపేందుకు ప్రయత్నిస్తున్నారని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మండిపడ్డారు. హరీశ్?రావు మంత్రిగా చేశాననే విషయం మర్చిపోయి అనేక విషయాలపై అబద్ధాలు చెబుతున్నారని విమర్శించారు. బీఆర్‌ఎస్ నేతలు సోషల్ మీడియా ద్వారా అవాస్తవాలను ప్రచారం చేస్తున్నారన్నారు. వారు చెప్పే అబద్ధాలు ప్రజల్లోకి వెళ్లకూడదన్నారు. నిశ్శబ్ధంగా ఉంటే వ్యవస్థలకు నష్టం చేసిన వాళ్లమవుతామన్నారు. బీఆర్‌ఎస్? ప్రభుత్వ హయాంలో అబద్ధాల పునాదులపై పదేళ్లపాటు పాలన చేశారన్నారు. ఆ పార్టీ నేతలు కావాలని పదేపదే అబద్ధాలను ప్రచారం చేస్తున్నారని భట్టి విక్రమార్క మండిపడ్డారు. ఆ పార్టీ వారు అప్పులతో రాష్ట్రాన్ని సర్వనాశనం చేశారని భట్టి విక్రమార్క తెలిపారు. పదేళ్లు బీఆర్‌ఎస్? ప్రభుత్వం చేసిన అప్పులపై కేసీఆర్ మాట్లాడాలని ఆయన సవాల్ విసిరారు. అప్పులు చేసి రాష్ట్రంపై పెనుభారం వేసింది నిజం కాదా అని ప్రశ్నించారు.

#### సింగరేణి బొగ్గు ఆరోపణలపై విచారణకు ఆదేశం

సింగరేణికి నష్టం కలిగించాలని బీఆర్‌ఎస్? పార్టీ నాయకులు అనేక రకాలుగా ప్రయత్నిస్తున్నారని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ధ్వజమెత్తారు. కోల్?బ్లాక్?లు తెచ్చుకునేందుకు కేంద్రంతో మాట్లాడుతున్నామన్న ఆయన సింగరేణి నుంచి కేజీ బొగ్గు కూడా బయటకు వెళ్లేందుకు అవకాశం లేదన్నారు. సింగరేణిపై కావాలనే బీఆర్‌ఎస్ నేతలు దుష్ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. సింగరేణికి కొత్త బ్లాక్?లు రాకుండా అడ్డుకున్నది కేటీఆర్, హరీశ్?రావులేనని భట్టి విక్రమార్క ఆరోపించారు. సింగరేణిలో బొగ్గుమాయమైందని కేటీఆర్, హరీశ్?రావులు చేసిన ఆరోపణలపై స్పందించిన భట్టి విక్రమార్క వాటిపై విచారించాలని ఆ సంస్థ విజిలెన్స్? డైరెక్టర్?ను ఆదేశించారు. సింగరేణికి నష్టం కలిగిస్తే నష్టపోతేది రాష్ట్రప్రజలేనని ఆయన తెలిపారు.



# 'తెలంగాణ దమ్ బిర్యానీ - రాయలసీమ రాగి సంకటి'

- హైదరాబాద్‌లో నోరూరిస్తున్న ఫుడ్ ఫెయిర్

**టి మీడియా ,జూలై 3 ,హైదరాబాద్ బ్యూరో :**

హైదరాబాద్‌లో స్ట్రీట్ ఫుడ్, రెస్టారెంట్, హోటల్ ఫుడ్ కల్చర్ రోజురోజుకు పెరిగిపోతోంది. నగర ఫుడ్ లవర్స్‌కు నోరూరించే రుచులు, వంటకాలు అందించేందుకు హోటళ్లు, రెస్టారెంట్లే కాకుండా అంకుర సంస్థలు కూడా ముందుకొచ్చాయి. ఈ నేపథ్యంలో హైటెక్స్‌లో 3రోజులపాటు జరుగుతున్న 'ఫుడ్ ఎ ఫెయిర్-2026' కళకళలాడుతోంది. ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన చెఫ్‌లు, సంస్థలు, వినియోగదారులను ఓ వేదికపై తీసుకొచ్చి, భిన్న రకాల రుచులతో పాటు ఆరోగ్యకర, పౌష్టికాహార ఉత్పత్తులు అందుబాటులో ఉంచాయి.




**ఆకట్టుకుంటున్న సబల మిల్లెట్స్**

ఐటీ కారిడార్? ప్రాంతమైన మాదాపూర్ హైటెక్స్‌లో 'ఫుడ్ ఎ ఫెయిర్ -2026' సందడిగా సాగుతోంది. చెఫ్స్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, బ్లిట్జ్ ఎగ్జిబిషన్స్ సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో 3రోజుల పాటు జరగనున్న ఈ ప్రదర్శనను నేషనల్ బ్యాడ్మింటన్ కోచ్ పుల్లెల గోపిచంద్ లాంఛనంగా ప్రారంభించారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ నుంచి దాదాపు ఫుడ్ ఇండస్ట్రీ, ఔత్సాహిక వ్యాపారవేత్తలు, అంకుర కేంద్రాల వ్యవస్థాపకులు 150 పైగా స్టాళ్లు ఏర్పాటు చేశారు. రామోజీ గ్రూపునకు చెందిన ప్రియా ఫుడ్స్ ఆధ్వర్యంలో 'సబల మిల్లెట్స్' స్టాల్‌లో చిరుధాన్యాల ఉత్పత్తులు విశేషంగా ఆకట్టుకున్నాయి. కేవలం 2 నిమిషాల్లో తయారు చేసుకునేందుకు వీలైన కిచిడీలు, ఉప్మాలు, మిల్లెట్ నూడుల్స్, కుకీస్, ప్రోటీన్ బార్స్ వంటి ఆహార పదార్థాలు ఆకర్షణగా నిలిచాయి. పలు సంస్థల ఆధ్వర్యంలో ఉత్పత్తైన పాల పదార్థాలు, కేకులు, బిస్కట్లు, చాక్లెట్లు, ఇడ్లీలు, సమోసాలు, నూడిల్స్, లడ్డూలను సందర్శకులు తిలకించి రుచులు చూశారు.

**తెలుగు రాష్ట్రాల విభిన్న వంటకాలు**

ఫుడ్ పరిశ్రమ వర్గాలు, వినియోగదారులు, చెఫ్స్ అంతా ఆహార వ్యాపారం విస్తృతం చేయడంపై మేథోమదనం సాగించారు. ఈ సందర్భంగా తెలుగు రాష్ట్రాల నుంచి విచ్చేసిన పలు కళాశాలల విద్యార్థులకు వంటల తయారీపై పోటీలు నిర్వహించారు. తెలంగాణ, ఆంధ్రా, రాయలసీమ రుచులైన బిర్యానీ, హలీం, రాగిసంకటి, కోడికూర, అలసంద గారెలు వంటివి నోరూరించాయి. గుత్తి వంకాయ, కొబ్బరి బెల్లం మాస్, బెల్లం రవ్వ కేసరి, బోన్ లెస్ చికెన్ తదితర వంటకాలు విశేషంగా ఆకర్షించాయి. వంటల పోటీలో పాల్గొనడంపై విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు. ఆరోగ్యాభిలాషులు సందర్శించి ఆహార పరిశ్రమను ప్రోత్సహించాలని ప్రముఖ చెఫ్స్ సూచించారు.

**డిగ్రీ, డిప్లొమా కోర్సులు అందించేలా**

ఫుడ్ ఎ ఫెయిర్-2026లో ఫ్రోజెన్ ఫుడ్స్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. కూరగాయలు, పండ్లు, బఠానీలు, స్వీట్ కార్న్, క్యారెట్, బ్రోకలీ వంటివి పలు బ్రాండెడ్ కంపెనీలు తమ ఉత్పత్తుల ప్రదర్శించారు. మాంసం, సీఫుడ్, చికెన్ నగ్గెట్స్, కబాబ్స్, చేపలు, రొయ్యలు, తిన్నడానికి సిద్ధంగా ఉన్న పరాటాలు, సమోసాలు, పిజ్జాలు, ఐస్‌క్రీమ్‌లు పలకరించాయి. సీజన్‌తో సంబంధం లేకుండా అన్ని రకాల ఆహార పదార్థాలు ఏడాది పొడవునా అందుబాటులో ఉంటాయి. బహుళ ప్రయోజనాలు దృష్ట్యా ఈ రంగంలో డిగ్రీ, డిప్లొమా కోర్సులు అందించేందుకు పలు సంస్థలు ముందుకొచ్చి ఉపాధి కల్పిస్తున్నారు.


**విదేశీ ఎగుమతుల అవకాశాలపై అవగాహన**

దేశంలోని ప్రముఖ చెఫ్‌లు ప్రత్యక్ష వంట ప్రదర్శనలు, ప్రత్యేక రుచుల పరిచయ కార్యక్రమాలు, ఫుడ్ పోటీలు, సదస్సుల తరుణంలో విదేశీ ఎగుమతి అవకాశాలపై అపెడా సంస్థ అవగాహన కల్పిస్తోంది. ఆధునిక ఆహార వాణిజ్యం, ఆవిష్కరణలు, వాల్యూ ఎడిషన్ ఉత్పత్తులు, మార్కెట్ అవకాశాల మధ్య వారధిగా నిలించేందుకు సాగుతున్న ఫుడ్ ఫెయిర్‌కు సందర్శకులు పోటెత్తుతున్నారు. బీ-టు-బీ భేటీలు, కొత్త ఆవిష్కరణలు, ప్రత్యక్ష ప్రదర్శనలు, పరిశ్రమ రంగ నిపుణులతో చర్చలు నడుస్తున్నాయి.

## బ్యాంకులో డబ్బులు లేవు.. కుర్చీల్లో సిబ్బంది లేరు

- యూనియన్ బ్యాంకులో రైతుల అరిగోస

**టి మీడియా ,జూలై 3 ,కోనరావుపేట:**



కష్టపడి పండించిన వరి ధాన్యానికి సంబంధించిన డబ్బులు ఖాతాల్లో జమ కావడంతో ఆనందంగా బ్యాంకుకు వెళ్లిన రైతులకు చేదు అనుభవం ఎదురైంది. కోనరావుపేట మండల కేంద్రంలోని యూనియన్ బ్యాంకులో నగదు కొరత, సిబ్బంది లేకపోవడం, ఖాతాదారులకు సరైన సేవలు అందకపోవడంతో రైతులు, వృద్ధులు, మహిళలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.శుక్రవారం ఉదయం నుంచే భారీ సంఖ్యలో రైతులు తమ ఖాతాల నుంచి డబ్బులు డ్రా చేసుకునేందుకు బ్యాంకుకు చేరుకున్నారు.అయితే మధ్యాహ్నం 12:30 గంటలకే బ్యాంకులో నగదు లేదని సిబ్బంది చెప్పడంతో రైతులు నిరాశకు గురయ్యారు. ఇదే సమయంలో పలు కౌంటర్ల వద్ద సిబ్బంది కనిపించకపోవడం, కుర్చీలు ఖాళీగా ఉండడం ఖాతాదారులను మరింత అసహనానికి గురిచేసింది.సిబ్బంది ఎక్కడ ఉన్నారని ప్రశ్నించిన ఖాతాదారులకు సరైన సమాధానం ఇవ్వకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించారని బాధితులు ఆరోపించారు.దూర ప్రాంతాల నుంచి వచ్చిన వృద్ధులు, మహిళలు, రైతులు గంటల తరబడి బ్యాంకు వద్ద వేచి ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది.తమ సమస్యలను వివరించేందుకు వెళ్లిన ఖాతాదారుల పట్ల బ్యాంకు మేనేజర్ యాదగిరి దురుసుగా ప్రవర్తించారని పలువురు రైతులు, మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు. ఖాతాదారులతో మర్యాదగా వ్యవహరించకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించారు.రైతులకు, వృద్ధులకు సకాలంలో సేవలు అందించాల్సిన బ్యాంకు అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం పట్ల స్థానిక ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కోనరావుపేట యూనియన్ బ్యాంకులో నగదు కొరతను వెంటనే నివారించి, సిబ్బంది కొరత సమస్యను పరిష్కరించడంతో పాటు ఖాతాదారుల ఫిర్యాదులపై ఉన్నతాధికారులు విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని రైతులు, ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

## తమ్ముణ్ని బాగా చూసుకొమ్మని పెద్ద కొడుకుతో అప్పజెప్పి

- రైలు కిందపడి దంపతుల ఆత్మహత్య

**టి మీడియా ,జూలై 3 ,మేడ్చల్ మల్కాజ్?గిరి:**

జిల్లాలోని ఘట్ కేసర్ రైల్వే స్టేషన్ పరిధిలో గురువారం రాత్రి విషాదకర ఘటన చోటుచేసుకుంది. మహబూబాబాద్ జిల్లా చెన్నారావుపేట మండలంలోని పాపాయిపేట గ్రామానికి చెందిన దంపతులు రవికుమార్, శిరీషలు ఘట్?కేసర్ రైల్వే స్టేషన్ సమీపంలో రైలు కిందపడి ఆత్మహత్యకు పాల్పడ్డారు. పోలీసులకు సమాచారం అందడంతో ఘటనా స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసి, భార్యా భర్తల మరణంపై విచారణ చేపట్టారు.



**డబ్బులివ్వకుండా బెదిరించారని**

కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం దంపతులు ప్రస్తుతం పెద్ద అంబర్?పేట్?లోని కుంట్లూరులో నివసిస్తున్నట్లు తెలిపారు. కొద్ది రోజుల కిందట వీరు అదే ప్రాంతంలో ఉండే నీలి వెంకటేశ్?, ప్రియా దంపతులతో కలిసి రెడీ మిక్స్? వాహనాన్ని కొనుగోలు చేసినట్లు చెప్పారు. మొదట్లో కొన్నాళ్ల పాటు వ్యాపారం బాగానే సాగిందన్నారు. కానీ, గత రెండు నెలల నుంచి రవి కుమార్?కు వెంకటేశ్? డబ్బులు ఇవ్వకపోవడంతో ఇద్దరి మధ్య విభేదాలు తలెత్తినట్లు వివరించారు.వేధింపుల వల్లే చనిపోయారంటూ : ఇదే విషయమై వెంకటేశ్, ప్రియాలను నిలదీయడంతో వారు తిరిగి రవికుమార్ దంపతులపై బెదిరింపులకు దిగినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. గురువారం రాత్రి కూడా వెంకటేశ్? అతని భార్య కలిసి రవికుమార్?, శిరీషలను తీవ్రంగా వేధింపులకు గురిచేశారని అన్నారు. దీంతో మనస్థాపం చెందారని, అందుకే ఆత్మహత్యకు పాల్పడ్డారన్నారు. పోలీసులు దర్యాప్తు చేసి బాధ్యులను కఠినంగా శిక్షించాలని కుటుంబీకులు కోరుతున్నారు.

## 45 దేశాలు, 75 టోర్నీలు, 35 పతకాలు

- చెస్‌లో సత్తా చాటుతున్న ప్రియాంక

**టి మీడియా ,జూలై 3 , విజయవాడ :**



చెస్ బోర్డుపై కనిపించేది పావులు, గడులు మాత్రమే కాదు. వాటి వెనుక ఆటగాళ్ల ఆలోచనాశక్తి, సహనం, పట్టుదల దాగి ఉంటుంది. అలాంటి లక్షణాలను 7ఏళ్ల వయసు నుంచే అలవరచుకుంది విజయవాడకు చెందిన ప్రియాంక. అనతి కాలంలోనే విమెన్ గ్రాండ్ మాస్టర్ టైటిల్ అందుకుని అంతర్జాతీయ చెస్ వేదికలపై సత్తా చాటింది. 45 దేశాల్లో 75 టోర్నమెంట్లలో పాల్గొని 35 పతకాలు కైవసం చేసుకుంది. తాజాగా ఫిడే రేటింగ్‌లో 2352 పాయింట్లు పొంది మరో ఘనతను తన ఖాతాలో వేసుకుంది. ఆమె ప్రయాణం ఎలా కొనసాగింది? ఎదుర్కున్న సవాళ్లు ఏంటి? ఈ కథనంలో తెలుసుకుందాం. చెస్ కేవలం ఆట కాదు. అది ఆలోచనలకు పరీక్ష. సహనానికి ప్రతీక. వ్యూహాలకు నిలయం. అలాంటి క్రీడలో రాణించాలంటే తెలివితేటలతో పాటు అపారమైన ఏకాగ్రత, నిరంతర సాధన అవసరం. అవే లక్షణాలతో ముందడుగు వేసింది ఆ యువతి. తొలి ప్రయత్నంలోనే 2011లో జిల్లా, రాష్ట్ర, జాతీయ అండర్-9 కేటగిరీల్లో పసిడి పతకం సాధించింది. 2012లో శ్రీలంకలో జరిగిన ఏషియన్ అండర్-10, యూత్ కేటగిరీల్లో క్లాసిక్, బ్లిట్జ్, ర్యాపిడ్ విభాగాల్లో 6 పసిడి పతకాలు సాధించింది. అదే ఏడాది స్లొవేనియాలో జరిగిన వరల్డ్ అండర్-10 వ్యక్తిగత చాంపియన్‌షిప్ పోటీలో విజేతగా నిలిచింది.విజయవాడకు చెందిన ఈ యువతి ప్రియాంక. తల్లిదండ్రులు దుర్గాదేవి, రాధాకృష్ణ. 7 ఏళ్ల వయసులో వేసవి శిబిరంలో సరదాగా చెస్ నేర్చుకుంది. క్రమంగా ఆ ఆసక్తిని జీవిత లక్ష్యంగా మలచుకుంది. ప్రత్యర్థి ఎత్తుగడలను అంచనా వేస్తూ, కొత్త వ్యూహాలు నేర్చుకుంటూ, ఆటలోని ప్రతి అంశాన్ని లోతుగా అధ్యయనం చేస్తూ తనను తాను మెరుగుపరుచుకుంది. ఆమె ఆసక్తిని గమనించిన తల్లిదండ్రులు ఏడాది చదువు ఆపించి మరీ శిక్షణ ఇప్పించారు. వారి నిర్ణయాన్ని వేలెత్తి చూపడానికి అవకాశం ఇవ్వకుండా అంతర్జాతీయ స్థాయిలో రాణించింది ప్రియాంక. చెస్ ప్రపంచంలో ఫిడే రేటింగ్‌కు ప్రత్యేక ప్రాధాన్యం ఉంటుంది. ఒక ఆటగాడి సామర్థ్యం, స్థిరత్వం, ప్రతిభను ప్రతిబింబించే ప్రమాణంగా దీన్ని భావిస్తారు. 2010లో 1422 రేటింగ్‌తో కెరీర్ ప్రారంభించిన ప్రియాంక 2022లో 2300 ఫిడే రేటింగ్ పాయింట్లు సాధించింది. అంతేకాదు 3 వార్మ్స్‌ను సొంతం చేసుకుని విమెన్ గ్రాండ్ మాస్టర్ టైటిల్ సొంతం చేసుకుంది.విదేశాల్లో జరిగే టోర్నీల్లో పాల్గొనేందుకు ప్రియాంకకి లక్షల్లో ఖర్చయ్యేది. కొన్ని రోజులు తల్లిదండ్రుల సాయం తీసుకున్నా, స్వతహాగా ఏదైనా చేయాలని భావించింది. ఆన్‌లైన్‌లో 8ఏళ్లు పైబడిన చిన్నారులకు శిక్షణ ఇవ్వడం ప్రారంభించింది. అలా వచ్చిన నగదుతో పోటీలకు హాజరవుతోంది. వరల్డ్ జూనియర్ టోర్నమెంట్ కొద్దిలో మిస్ అయినా, వెనువెంటనే వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ప్రపంచ కప్‌కి సెలెక్ట్ అయ్యింది. కుమార్తె విజయం పట్ల ఆనందం వ్యక్తం చేస్తోంది తల్లి దుర్గాదేవి. మొదట్లో ఎన్నో మాటలని అవమానించిన వారంతా ప్రస్తుతం ఫోన్‌లు చేసి మరీ ప్రశంసిస్తున్నారని చెబుతోంది.సాధారణ వేసవి శిబిరంలో మొదలైన ప్రియాంక చెస్ ప్రయాణం, నేడు అంతర్జాతీయ స్థాయికి చేరింది. రానున్న రోజుల్లో గ్రాండ్ మాస్టర్ కావడమే లక్ష్యంగా సన్నద్ధమవుతోంది.

## ఈ-వేలంలో విమానాన్ని విక్రయించిన ఈడీ

- హైదరాబాద్ ఈడీ స్వాధీనం చేసుకున్న హాకర్800ఏ

**టి మీడియా ,జూలై 3 ,హైదరాబాద్ బ్యూరో:**




దేశంలోనే మొదటిసారిగా, ఓ కేసులో జప్తు చేసిన విమానాన్ని అధికారులు వేలం వేశారు. హైదరాబాద్ జోనల్ కార్యాలయానికి చెందిన అధికారులు హాకర్ 800ఏ రకానికి చెందిన విమానాన్ని ఎంఎస్‌టీసీ సంస్థ ద్వారా రూ. 3 కోట్లకు బహిరంగ వేలంలో విక్రయించారు. విమానం విక్రయంతో వచ్చిన సొమ్మును ఈడీ బాధితులకు చెల్లించనుంది. ఫాల్కన్ స్కామ్ లో నిందితులు దేశవ్యాప్తంగా 7056 మంది డిపాజిటర్ల నుంచి దాదాపు రూ.4215 కోట్లు సేకరించారు. మోసం వెలుగులోకి వచ్చేసరికి 4065 మంది డిపాజిటర్ల నుంచి దాదాపు రూ. 792 కోట్ల వసూలు చేసినట్లు అధికారులు గుర్తించారు.

**అసలేం జరిగిందంటే?**

హైదరాబాద్ కేంద్రంగా పనిచేసే మెసర్స్ క్యాపిటల్ ప్రొటెక్షన్ ఫోర్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ ఇన్వాయిస్ డిస్కౌంటింగ్ స్కీమ్ పేరుతో ఒక నకిలీ వ్యాపారాన్ని తెరపైకి తెచ్చింది. పెట్టుబడి పెడితే భారీగా లాభాలు ఇస్తామంటూ నమ్మించి, వేలాది మంది అమాయక పెట్టుబడిదారుల నుంచి కోట్లు రూపాయలను వసూలు చేసింది. తీరా చూస్తే, అక్కడ ఎలాంటి ఇన్వాయిస్ డిస్కౌంటింగ్ వ్యాపారమూ జరగలేదని, అది కేవలం ఒక బోగస్ స్కీమ్ అని అధికారులు తెల్చారు. ఈ మోసంపై సైబరాబాద్ ఎకనామిక్ అఫెన్సెస్ వింగ్ మూడు ఎఫ్ఐఆర్‌లు నమోదు చేయడంతో, ఈడీ రంగంలోకి దిగి పీఎంఎల్ఏ చట్టం కింద మనీలాండరింగ్ దర్యాప్తును ప్రారంభించింది.ఈ స్కామ్‌కు సూత్రధారి అయిన ఫాల్కన్ గ్రూప్ సీఎండీ అమర్‌దీప్ కుమార్, క్యాపిటల్ ప్రొటెక్షన్ ఫోర్స్ సంస్థతో పాటు ఇతరులపై ఈడీ గట్టి నిఘా పెట్టింది. దర్యాప్తులో భాగంగా 2025, మార్చి 7న ఈడీ హైదరాబాద్ జోనల్ అధికారులు శంషాబాద్‌లోని రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో నిందితుడికి చెందిన హాకర్ 800ఏ విమానాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో సహ నిందితులైన సందీప్ కుమార్, శరద్ చంద్ర తోష్నివాల్, ఆర్యన్ సింగ్ ఛాబ్రా నిందితులను ఈడీ అధికారులు అరెస్ట్ చేశారు. విమానాన్ని సీజ్ చేసిన తర్వాత, ఈడీ చట్టపరమైన అనుమతులను తీసుకుంది.

**ఈ వేలంలో రూ.3కోట్లు పలికిన విమానం**

గత ఏడాది ఆగస్టు 18 న విమానం జప్తును సమర్థిస్తూ పీఎంఎల్ఏ అడ్జుడికేటింగ్ అథారిటీ ఈడీ దరఖాస్తును ధృవీకరించింది. 2025 సెప్టెంబర్ 29 న నిందితులపై ఈడీ ప్రత్యేక కోర్టులో ఛార్జ్‌షీట్ దాఖలు చేసింది. 2025 నవంబర్ 20న జప్తు చేసిన ఆస్తులను విక్రయించేందుకు వీలు కల్పించే పీఎంఎల్ఏ రూల్స్ 2013 శిరూల్ 4(2)ి ప్రకారం విమానాన్ని వేలం వేసేందుకు అనుమతించాలని ఈడీ కోరగా, అడ్జుడికేటింగ్ అథారిటీ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది.ఈ అనుమతులతోనే చట్టపరమైన అన్ని అడ్డంకులను తొలగిన తర్వాత 2026 జూలై 1న రూ. 3 కోట్లకు విమానాన్ని వేలం వేశారు. అయితే కొనుగోలుదారు వివరాలు మాత్రం ఈడీ వెల్లడించలేదు.

## గ్రామాల్లో నాలుగు రకాల చెత్త సేకరణ :సీఈవో ఎల్లయ్య

**టి మీడియా ,జూలై 3, మెదక్ :**



గ్రామాలను పరిశుభ్రంగా, పచ్చదనంతో తీర్చిదిద్దడంతో పాటు వర్షాకాలంలో ప్రజారోగ్యాన్ని పరిరక్షించేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా పరిషత్ సీఈఓ ఎల్లయ్య సూచించారు. ఘన వ్యర్థాల నిర్వహణ, వనమహోత్సవం, వర్షాకాల సన్నద్ధత తో పాటు వర్షాకాలంలో చేపట్టాల్సిన ముందస్తు చర్యలపై పంచాయతీ కార్యదర్శులు , ఫీల్డ్ అసిస్టెంట్లు తో శుక్రవారం నాడు మండల పరిషత్ సమావేశ మందిరంలోనిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన పలు కీలక ఆదేశాలు జారీ చేశారు.

**నాలుగు రకాల చెత్త వేరు చేసే విధానం**

ప్రతి గ్రామంలో తప్పనిసరిగా నాలుగు రకాల చెత్త సేకరణ విధానాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని, ఇంటింటికీ అవగాహన కార్యక్రమాలు నిర్వహించి డోర్-టు-డోర్ స్టిక్కర్ల పంపిణీ, అతికింపు కార్యక్రమాలను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. గ్రామ ప్రజలకు ఆదర్శంగా ముందుగా సర్పంచ్‌లు, వార్డు సభ్యుల ఇళ్లలోనే నాలుగు రకాల చెత్త వేరు చేసే విధానాన్ని అమలు చేయాలని సూచించారు.వనమహోత్సవ కార్యక్రమాలను వేగవంతం చేసి విస్తృతంగా మొక్కలు నాటడంతో పాటు వాటి సంరక్షణకు ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని పేర్కొన్నారు. నాటిన ప్రతి మొక్కను సంరక్షించి పచ్చదనాన్ని పెంపొందించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు.

**వర్షాకాల ముందస్తు చర్యలు**

వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని మాన్సూన్ ప్రిపేర్డ్‌నెస్ చర్యలను పటిష్టంగా అమలు చేయాలని సీఈఓ ఆదేశించారు. డ్రైనేజీలను ఎప్పటికప్పుడు శుభ్రపరచడం, ఎక్కడా వర్షపు నీరు నిల్వ లేకుండా చర్యలు తీసుకోవడం, దోమల నివారణ కార్యక్రమాలను ముమ్మరం చేయడం, తాగునీటి పరిశుభ్రతను నిర్ధారించడం, వర్షాకాలంలో ప్రబలే సీజనల్ వ్యాధుల నివారణకు అధికారులు అప్రమత్తంగా ఉండాలని స్పష్టం చేశారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలను సమర్థవంతంగా అమలు చేయాలని సూచించారు. ఈ సమీక్ష సమావేశంలో ఎంపీడీవో క్రాంతి కుమార్, ఎంపీఓ జాకీర్ హుస్సేన్, ఏపీఓ సంతోష్ కుమార్, పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

## బర్త్ టూరిజంపై ట్రంప్ సర్కార్ కన్ను

- జన్మతః పౌరసత్వంపై సుప్రీం
- తాజా తీర్పు నేపథ్యంలో ప్లాన్ బీ సిద్ధం

**టి మీడియా ,జూలై 3 , ఢిల్లీ బ్యూరో :**



జన్మతః పౌరసత్వం కేసులో అమెరికా సుప్రీంకోర్టు నుండి గట్టి ఎదురుదెబ్బ తగిలిన తర్వాత అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రభుత్వం బర్త్ టూరిజం(జనన పర్యాటకం)గా పిలిచే దీర్ఘకాలిక సమస్యను ఎదుర్కొనడానికి ఒక కొత్త మార్గాన్ని అన్వేషిస్తున్నది. గర్భంతో ఉన్న విదేశీ మహిళలు అమెరికాలోకి ప్రవేశించకుండా నిషేధించడం వంటి కొత్త ప్రణాళికపై ట్రంప్‌కు చెందిన మేక్ అమెరికా గ్రేట్ అగైన్(మాగా) మిత్రులు దృష్టి పెట్టినట్లు వార్తాకథనాలు సూచిస్తున్నాయి.బర్త్ టూరిజంకు ఏర్పాటు చేయడంలో సాయపడే సంస్థలు, వ్యక్తులపై చట్టపరమైన చర్యలు చేపట్టడం, తమ సందర్శన ఉద్దేశాన్ని దాచిపెట్టి అమెరికాలోకి ప్రవేశించే మహిళలపై మోసానికి పాల్పడినట్లు అభియోగాలు నమోదు చేయడం, అంతేగాక గర్భంతో ఉన్న విదేశీ మహిళలను దేశంలోకి ప్రవేశించకుండా అడ్డుకోవడం సహా పలు ప్రత్యామ్నాయాలను అధికారులు పరిశీలిస్తున్నారని ఆక్సియోస్ వార్తాసంస్థ కథనం పేర్కొంది. కాగా, జన్మతః లభించే అమెరికన్ పౌరసత్వ విలువను పరిరక్షించడానికి అధ్యక్షుడు ట్రంప్‌నకు పూర్తిగా కట్టుబడి ఉన్నారని, అందుకే నిన్నటి సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో దీనిపై తక్షణ చర్యలు చేపట్టాలని ఆయన కాంగ్రెస్‌ను ఆదేశించారని వైట్ హౌస్ ప్రతినిధి అబిగైల్ జాక్సన్ ఆక్సియోస్‌కు తెలిపారు. జనన పర్యాటక పథకాలపై దర్యాప్తులకు న్యాయ శాఖ కూడా ప్రాధాన్యత ఇస్తుందని ఆమె చెప్పారు.అమెరికన్ పౌరసత్వాన్ని పరిరక్షించడానికి ట్రంప్ ప్రభుత్వం వద్ద అనేక సాధనాలు ఉన్నాయని ఆమె తెలిపారు. ఇలా ఉండగా, గర్భవతిగా ఉన్న విదేశీ సందర్శకులు అమెరికాలోకి ప్రవేశించకుండా నిషేధించాలని ఫెడరలిస్ట్ వ్యవస్థాపకుడు సీన్ డేవిస్ బహిరంగంగా పిలుపునిచ్చారు. ట్రంప్ ఇమిగ్రేషన్ సలహాదారు స్టీఫెన్ మిల్లర్ కూడా తాత్కాలిక సందర్శకులపై కఠినమైన తనిఖీలను సూచించారు. తాత్కాలిక ప్రాతిపదికన అయినా సరే మీ దేశంలోకి ఎవరిని అనుమతిస్తున్నారనే విషయమై అమెరికా చాలా జాగ్రత్తగా ఆలోచించాలని ఫాక్స్ న్యూస్‌తో మాట్లాడుతూ మిల్లర్ అన్నారు.

**బర్త్ టూరిజం అంటే**

బర్త్ టూరిజం అంటే విదేశీ సందర్శకులు ప్రధానంగా అమెరికాలో ప్రసవించడం కోసం అక్కడికి ప్రయాణించడం, తద్వారా ఆ దేశపు జన్మతః పౌరసత్వ చట్టం ప్రకారం వారి బిడ్డకు దానంతట అదే అమెరికా పౌరసత్వం లభిస్తుంది. ప్రభుత్వం అధికారికంగా ఇటువంటి కేసులను నమోదు చేయనప్పటికీ ప్రైవేట్ అంచనాల ప్రకారం ఏటా విదేశీ సందర్శకులకు సుమారు 20,000 నుండి 26,000 వరకు శిశువులు అమెరికాలో జన్మిస్తున్నారు. ఇదిలా ఉండగా బర్త్ టూరిజం పథకాలపై దర్యాప్తునకు అమెరికా న్యాయశాఖ ఇప్పటికే ఫెడరల్ ప్రాసిక్యూటర్లను ఆదేశించింది.



## 'వానలు లేవు-మళ్లీ వలసే దిక్కయ్యేనా..?

- 'ఎల్‌నినో'తో చతికిలపడ్డ సాగు పనులు

**టి మీడియా ,జూలై 3 ,హైదరాబాద్ బ్యూరో :**

ఈ పాటికే వర్షాలు, వరి నాట్లతో కళకళలాడే ఊళ్లు ఇప్పుడు బోసిపోయి కనిపిస్తున్నాయి. 'ఎల్‌నినో' రూపంలో కరవు రక్కసి పడగ విప్పగా, రాష్ట్రవ్యాప్తంగా సాగు పనులు పూర్తిగా చతికిలపడ్డాయి. వానాకాలం సీజన్ సగం దాటినా వరుణుడు ముఖం చాటేయడంతో రైతులు ఆందోళనలో పడ్డారు. కనీసం నారుమళ్లకు కూడా నీళ్లు లేకపోవడంతో పొట్టకూటి కోసం నగరాల బాట పట్టక తప్పదేమోననే రైతులు బిక్కుబిక్కుమంటున్నారు. ఒకప్పుడు కరవు, వలసలకు మారుపేరుగా నిలిచిన పాలమూరులో మాత్రం పరిస్థితి తీవ్రతరమైంది. ఇప్పటి వరకు పావువంతు మాత్రమే సాగు మొదలవగా, వ్యవసాయ కూలీలు పాలుపోని స్థితిలో ఉన్నారు.

**ఎల్‌నినో సెగతో ఉమ్మడి పాలమూరుపై మళ్లీ కరవు పడగ**

ఇప్పుడిప్పుడే పచ్చబడుతోందనుకున్న పాలమూరులో 'ఎల్‌నినో' రూపంలో కరవు రక్కసి మళ్లీ పడగ విప్పింది. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో వర్షాలు లేక సాగు పనులు పూర్తిగా చతికిలపడ్డాయి. దాదాపు 19 లక్షల ఎకరాలకు గానూ పావు వంతు మాత్రమే సాగు మొదలైంది. చేతినిండా పనిలేక, పొట్టకూటి కోసం కూలీలు మళ్లీ నగరాల బాట పట్టే దుస్థితి నెలకొంది. వరినాట్లతో రోజుకు దాదాపు రూ.1000 సంపాదించుకునే మహిళలు ఏం చేయాలో పాలుపోని స్థితిలో ఉన్నారు. కూలీ కోసం మళ్లీ నగరాల బాట పట్టక తప్పదేమోననే ఆందోళన వెలిబుచ్చుతున్నారు.

**వర్షాలు లేక పూర్తిగా చతికిలపడ్డ వ్యవసాయ పనులు**

జిల్లా వ్యాప్తంగా సుమారు 10 లక్షల మంది రైతులున్నారు. అందులో 90 శాతం మంది సన్న, చిన్నకారు రైతులే. సుమారు ఐదారు లక్షల మంది ఉపాధి హామీ కూలీలున్నారు. వరి, పత్తి, మొక్కజొన్న ప్రధాన పంటలు కాగా, ప్రస్తుతం అడపా దడపా చినుకులు కూడా కురవలేదు. నారాయణపేట, గద్వాల జిల్లాల్లో పత్తి మహబూబ్ నగర్ జిల్లాలోని పలు మండలాల్లో జొన్నలు, కందుల వంటి ఆరుతడి పంటలేశారు. వర్షాలు పడితే నాట్లేసుకుందామనుకున్నా, కనీసం తుకాలు పోసుకునేందుకు సైతం నీళ్లులేని పరిస్థితి. దీంతో వ్యవసాయ పనులు లేక అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**కుటుంబ పోషణ భారమై ఆవేదన చెందుతున్న రైతులు**

కూర్చుని తింటే కొండలైనా కరిగిపోతాయని వ్యవసాయ కూలీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పనులు లేక ఇంటి ఖర్చులు భారమవుతున్నాయని చెబుతున్నారు. వివిధ కారణాలతో కొన్నిచోట్ల ఉపాధి హామీ పనులు నిలిపివేశారని, పని చేసుకుందామంటే అది కూడా లేకుండా పోయిందని అంటున్నారు. కేంద్రం కొత్తగా తెచ్చిన వీబీజీ - రాంజీ పథకంలో వర్షాకాలంలో 60 రోజుల పాటు విరామం ఇవ్వాలనే నిబంధన కూలీలను కలవరపెడుతోంది. నిత్యావసరాలు, కుటుంబ పోషణ వల్ల వడ్డీ వ్యాపారుల చేతికి చిక్కి అప్పుల ఊబిలో కూరుకుపోయే ప్రమాదముందని అన్నదాతలు, వ్యవసాయ కూలీలు ఆందోళన చెందుతున్నారు.

## అమర్‌నాథ్ యాత్ర ప్రారంభం

- భారీ వర్షంలోనూ భక్తుల సందడి

**టి మీడియా ,జూలై 3 , ఢిల్లీ బ్యూరో :**




హర్ హర్ మహాదేవ్ నామస్మరణ మధ్య అమర్‌నాథ్ యాత్ర శుక్రవారం లాంఛనంగా ప్రారంభమైంది. దక్షిణ కశ్మీర్ హిమాలయాల్లో 3,880మీటర్ల ఎత్తులో కొలువైన పవిత్ర మంచులింగాన్ని దర్శించుకునేందుకు యాత్రికుల తొలి బృందం బాల్టాల్, నున్వాన్ బేస్ క్యాంపుల నుంచి బయలుదేరింది. వర్షం కురుస్తున్నప్పటికీ భక్తులు ఎంతో ఉత్సాహంగా తమ ప్రయాణాన్ని మొదలుపెట్టారు.గురువారం 4,809మంది యాత్రికులతో కూడిన మొదటి బృందాన్ని జమ్ములోని భగవతినగర్ బేస్ క్యాంప్ వద్ద లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా జెండా ఊపి ప్రారంభించారు. మధ్యాహ్నానికి కశ్మీర్ లోయకు చేరుకున్న ఈ బృందానికి స్థానికులు, అధికారులు స్వాగతం పలికారు. వారు నేరుగా గుహ వద్దకు చేరుకుని సహజసిద్ధంగా ఏర్పడిన మంచు లింగాన్ని దర్శించుకుంటారు.

**కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు**

మరోవైపు, యాత్ర సాఫీగా సాగేందుకు అధికార యంత్రాంగం కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేసింది. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా వేలాది మంది పోలీసులు, సీఆర్పీఎఫ్, ఇతర పారామిలటరీ బలగాలను మోహరించారు. అలాగే గగనతల నిఘాను కూడా ఏర్పాటు చేశారు. 57రోజులపాటు కొనసాగనున్న అమర్‌నాథ్ యాత్ర, ఆగస్టు 28న ముగియనుందఇదిలా ఉండగా, యాత్ర ప్రారంభమైన తొలిరోజే భారీ వర్షం కురుస్తోంది. వర్షం నీటికి కొండ మార్గాలు జారుడుగా మారడంతో పైకి వెళ్లేందుకు భక్తులు ఇబ్బందులు పడ్డారు. అయినప్పటికీ, భక్తుల ఏమాత్రం వెనక్కి తగ్గలేదు. ప్రతికూల వాతావరణాన్ని సైతం లెక్క చేయకుండా మంచు లింగ దర్శనం కోసం ముందుకుసాగుతున్నారు. అయితే, భక్తులకు ఇబ్బంది కలగకుండా భద్రతా బలగాలు, సహాయక బృందాలు అప్రమత్తతతో వ్యవహరిస్తున్నాయి.

**అమర్‌నాథ్? యాత్ర మరపురాని గొప్ప అనుభవం**

అమర్‌నాథ్ యాత్ర ప్రారంభమవుతున్న సందర్భంగా భక్తులకు ప్రధాని మోదీ లేఖ రాశారు. యాత్రను చేపట్టనున్న భక్తులకు శుభాకాంక్షలు తెలిపారు. అలాగే ఈ యాత్రను గొప్ప భాగ్యంగా అభివర్ణించారు. భక్తులు పరిపూర్ణమైన భక్తిశ్రద్ధలతో, క్రమశిక్షణ, జాతీయ భద్రతా భావంతో ఈ యాత్రను చేపట్టాలని కోరారు.ఈ సందర్భంగా యాత్రికులు ప్రభుత్వ సూచనలు పాటించాలని ప్రధాని మోదీ కోరారు. పరిశుభ్రతా, ట్రాఫిక్? నియమాలను, భద్రతా సూచనలను పాటించాలని తెలిపారు. అలాగే, 'ఓకల్? ఫర్? లోకల్?' స్ఫూర్తితో, తమ ప్రయాణ ఖర్చుల్లో కనీసం 10 శాతం స్వదేశీ ఉత్పత్తులనే కొనుగోలు చేయాలని సూచించారు. దానివల్ల జమ్ముకశ్మీర్?లోని కుటుంబాలకు జీవనోపాధికి ఊపునిస్తుందని పేర్కొన్నారు. మరోవైపు, యాత్రకు సహకరించిన భారత సైన్యం, సీఆర్?పీఎఫ్?, జమ్ముకశ్మీర్? పోలీసులు, ఐటీబీపీ, బీఎస్?ఎఫ్?, ఎన్?డీఆర్?ఎఫ్ సిబ్బంది, ఆరోగ్య కార్యకర్తలు, వాలంటీర్లు, పారిశుధ్య కార్మికులకు ?మోదీ అభినందించారు. ఇక, తన సందేశాన్ని ముగిస్తూ, 'దేశమే ప్రథమం' అనే స్ఫూర్తితో, ఏడాది పొడవునా మన కర్తవ్యాలను నిజాయతీగా నిర్వర్తిస్తూ 'వికసిత్? భారత్?' నిర్మాణానికి తోడ్పాటును అందిద్దామని ఆయన పేర్కొన్నారు.


**ముందస్తుగా ఏ యాత్రికుడినీ అనుమతించబోము!**

ఇదిలా ఉండగా, అమర్‌నాథ్ యాత్రలో తమకు కేటాయించిన తేదీకి ముందు ఏ యాత్రికుడినీ అనుమతించబోమని జమ్ముకశ్మీర్? యంత్రాంగం శుక్రవారం స్పష్టం చేసింది. ప్రజలు కేవలం తమకు నిర్దేశించిన తేదీన మాత్రమే ప్రయాణించాలని విజ్ఞప్తి చేసింది. మరోవైపు, 3,800 మందికి పైగా యాత్రికులతో కూడిన రెండో బృందం శుక్రవారం జమ్ము బేస్ క్యాంపు నుంచి బయలుదేరిందని అధికారులు తెలిపారు.

# ప్రభుత్వ రంగ సంస్థల ఉద్యోగులకు శుభవార్త

- పదవీ విరమణ వయసు పెంపు

**టి మీడియా ,జూలై 3, అమరావతి బ్యూరో :**



రాష్ట్రంలోని ప్రభుత్వ రంగ సంస్థలు , కార్పొరేషన్లు, సొసైటీల్లో పనిచేస్తున్న శాశ్వత (పర్మనెంట్) ఉద్యోగుల పదవీవిరమణ వయసును 60 సంవత్సరాల నుంచి 62 సంవత్సరాలకు పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు ఆర్థికశాఖ ముఖ్య కార్యదర్శి పీయూష్ కుమార్ గురువారం అధికారిక ఉత్తర్వులు జారీ చేశారు. ప్రభుత్వ నిర్ణయంతో వేలాది మంది ఉద్యోగులకు ప్రత్యక్షంగా ప్రయోజనం చేకూరనుంది.ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టం--2014 ప్రకారం షెడ్యూల్--9, షెడ్యూల్--10 పరిధిలోకి వచ్చే ప్రభుత్వ రంగ సంస్థలు, కార్పొరేషన్లు, సొసైటీల్లో పనిచేస్తున్న ఉద్యోగులకు కూడా ఈ ఉత్తర్వులు వర్తిస్తాయి. దీంతో రాష్ట్రవ్యాప్తంగా వివిధ ప్రభుత్వ రంగ సంస్థల్లో పనిచేస్తున్న ఉద్యోగులందరికీ పదవీవిరమణ వయసు ఒకే విధంగా అమలుకానుంది. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల పదవీవిరమణ వయసును 2022లో ప్రభుత్వం 60 నుంచి 62 ఏళ్లకు పెంచింది. అయితే అదే ప్రయోజనం ప్రభుత్వ రంగ సంస్థలు, కార్పొరేషన్లు, సొసైటీల్లో పనిచేస్తున్న ఉద్యోగులకు వర్తించలేదు. అప్పటి నుంచే తమకూ సమాన నిబంధనలు అమలు చేయాలని ఆయా సంస్థల ఉద్యోగులు ప్రభుత్వాన్ని కోరుతూ వచ్చారు. ఉద్యోగ సంఘాలు పలుమార్లు విజ్ఞప్తులు చేయడంతో పాటు, కొందరు ఉద్యోగులు న్యాయస్థానాలను ఆశ్రయించి అనుకూల ఉత్తర్వులు కూడా పొందారు.

**ఆర్థిక పరిస్థితి పరిశీలన**

ఉద్యోగుల డిమాండ్, న్యాయస్థానాల ఆదేశాలు, ప్రభుత్వ రంగ సంస్థల పరిస్థితులను సమగ్రంగా పరిశీలించిన ప్రభుత్వం ఈ ప్రతిపాదనపై విస్తృతంగా చర్చించింది. ఖజానాపై పడే అదనపు ఆర్థిక భారం, సంస్థల ఆర్థిక సామర్థ్యాన్ని అంచనా వేసిన అనంతరం ఈ ప్రతిపాదనను మంత్రివర్గం ఆమోదించింది. అనంతరం అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది.

**తిరిగి విధుల్లోకి**

కొత్త ఉత్తర్వుల ప్రకారం ఇప్పటికే 60 ఏళ్ల వయసులో పదవీవిరమణ చేసిన ఉద్యోగులను తిరిగి విధుల్లోకి తీసుకోవాల్సి ఉంటుంది. వారికి 62 సంవత్సరాల వయసు పూర్తయ్యే వరకు ఉద్యోగంలో కొనసాగించే అవకాశం కల్పించాలి. అయితే ఈ ప్రయోజనం ఉత్తర్వుల పరిధిలోకి వచ్చే అర్హులైన ఉద్యోగులకు మాత్రమే వర్తిస్తుంది. 60 ఏళ్ల తర్వాత పదవీవిరమణ చేసి, తిరిగి విధుల్లో చేరే వరకు ఉద్యోగంలో లేని కాలానికి ఎటువంటి జీతభత్యాలు చెల్లించరు. ఆ కాలాన్ని నోషనల్ (కాల్పనిక) ప్రాతిపదికన మాత్రమే పరిగణనలోకి తీసుకుంటారు. అంటే, ఆ వ్యవధిని వార్షిక గ్రేడ్ ఇంక్రిమెంట్ల లెక్కింపుకు మాత్రమే ఉపయోగిస్తారు. అయితే నగదు ప్రయోజనాలు మాత్రం ఉద్యోగులు తిరిగి విధుల్లో చేరిన తేదీ నుంచే అమల్లోకి వస్తాయి.

**సీనియారిటీ ప్రయోజనం**

ఉద్యోగంలో లేని కాలాన్ని సీనియారిటీ, పదోన్నతుల విషయంలో కూడా పరిగణనలోకి తీసుకునే అవకాశం కల్పించారు. దీంతో ఉద్యోగులు తమ సర్వీసు పరంగా ఎలాంటి నష్టం చవిచూడకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుంది. ఇప్పటికే న్యాయస్థానాల ఆదేశాల మేరకు 62 సంవత్సరాల వయసు వరకు ఉద్యోగాల్లో కొనసాగుతున్న ఉద్యోగులను ప్రభుత్వ తాజా ఉత్తర్వులతో రెగ్యులర్ ఉద్యోగులుగానే పరిగణిస్తారు. వారికి రావాల్సిన అన్ని రకాల సేవా, ఆర్థిక ప్రయోజనాలను సంబంధిత సంస్థలు కల్పించాల్సి ఉంటుంది. ప్రభుత్వ ఉత్తర్వుల అమలు కోసం ఆయా ప్రభుత్వ రంగ సంస్థలు, కార్పొరేషన్లు, సొసైటీలు తమ సేవా నిబంధనల్లో అవసరమైన సవరణలు చేసుకోవాలని ప్రభుత్వం ఆదేశించింది. ఈ ప్రక్రియలో సంస్థల ఆర్థిక పరిస్థితిని పరిగణనలోకి తీసుకోవడంతో పాటు, అదనపు బడ్జెట్ అవసరమైతే ఆర్థికశాఖ అనుమతి పొందాల్సి ఉంటుంది.ప్రభుత్వ నిర్ణయంతో ప్రభుత్వ రంగ సంస్థల్లో పనిచేస్తున్న వేలాది మంది ఉద్యోగులకు రెండేళ్ల అదనపు ఉద్యోగ భద్రత లభించనుంది. ఉద్యోగ సంఘాలు ఎన్నాళ్లుగానో చేస్తున్న డిమాండ్‌కు ప్రభుత్వం సానుకూలంగా స్పందించడం ద్వారా ప్రభుత్వ ఉద్యోగులు, ప్రభుత్వ రంగ సంస్థల ఉద్యోగుల మధ్య ఉన్న పదవీవిరమణ వయస్సు వ్యత్యాసానికి తెరపడినట్లైంది. అదే సమయంలో ఆర్థిక భారం నియంత్రణ కోసం నగదు ప్రయోజనాలను తిరిగి విధుల్లో చేరిన తేదీ నుంచే అమలు చేయాలని ప్రభుత్వం స్పష్టం చేసింది.

# తెలంగాణలో ఎలక్ట్రిక్ బస్సుల సేవలు నిలిపివేత

- హై వోల్టేజ్ బ్యాటరీల వల్ల వరుసగా అగ్నిప్రమాదాలు

**టి మీడియా ,జూలై 3 ,హైదరాబాద్ బ్యూరో:**




ప్రయాణికుల భద్రతను దృష్టిలో ఉంచుకుని టీజీఎస్ఆర్టీసీ కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రవ్యాప్తంగా నడుస్తున్న జేబీఎం ఎలక్ట్రిక్ బస్సుల సేవలను తక్షణమే నిలిపివేసింది. ఇటీవల కాలంలో హై వోల్టేజ్ బ్యాటరీల వల్ల వరుసగా అగ్నిప్రమాదాలు చోటుచేసుకోవడంతో ఆర్టీసీ యాజమాన్యం ఈ నిర్ణయాన్ని ప్రకటించింది. ముఖ్యంగా జూన్ 21న కరీంనగర్ సమీపంలో జరిగిన ఘటన తర్వాత, మరిన్ని ప్రమాదాలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలు చేపట్టింది. ఈ నిర్ణయం వల్ల ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తోంది. భద్రతా ప్రమాణాల విషయంలో ఎటువంటి రాజీ పడకూడదని ఉన్నతాధికారులు కఠినమైన ఆదేశాలు జారీ చేశారు. జేబీఎం సంస్థకు చెందిన సుమారు వెయ్యి బస్సులను తాత్కాలికంగా రోడ్డుపైకి రాకుండా ఆపివేసింది. ఈ చర్యలతో బస్సుల్లో ప్రయాణించే వారందరికీ రక్షణ కల్పించేలా ఆర్టీసీ అడుగులు వేస్తోంది. ప్రయాణికుల నమ్మకాన్ని కాపాడటమే లక్ష్యంగా ఈ తాత్కాలిక నిలిపివేత కొనసాగుతుందని సంస్థ స్పష్టం చేసింది. ఇప్పటివరకు జరిగిన ప్రమాదాల విశ్లేషణ పూర్తి కాగానే, తదుపరి చర్యలపై నిర్ణయం తీసుకుంటారు.

## వధూవరులను ఆశీర్వదించిన మున్సిపల్ చైర్మన్

**టీ మీడియా, జులై 3, పెబ్బేరు:**



పెబ్బేరు పట్టణంలోని వల్లపురెడ్డి కళ్యాణ మండపంలో బ్రహ్మానందరెడ్డి కుమారుని వివాహ వేడుకకు మున్సిపల్ చైర్మన్ అక్కి శ్రీనివాస్ గౌడ్ పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ వెంకటేష్ సాగర్ రణధీర్ రెడ్డి సిద్దేశ్వర రెడ్డి కిషోర్ శ్రీనివాస్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇళ్లు భూమి పూజలో పాల్గొన్న సర్పంచ్

**టీ మీడియా, జులై 3 పెబ్బేరు:**



వనపర్తి జిల్లా పెబ్బేరు మండలంలోని కొత్త సూగూరు గ్రామంలో కేశపాగ కాశమ్మ భర్త కేశపాగ బాలస్వామి ఇందిరమ్మ ఇల్లు నిర్మాణానికి భూమి పూజ కార్యక్రమంలో కొత్త సూగూరు గ్రామ సర్పంచ్ దండు పద్మ అర్జున్ ఉప సర్పంచ్ కేశపాగ కృష్ణయ్య కాంగ్రెస్ సీనియర్ నాయకుడు శాంతన్న కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు స్వామి కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ గోవిందు గ్రామ పెద్దలు కుటుంబ సభ్యులు పాల్గొనడం జరిగింది.

## బేతుపల్లి రీ సర్వే ప్రక్రియను పారదర్శకంగా

- జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్

**టి మీడియా ,జూలై 3, ఖమ్మం (సత్తుపల్లి) :**




బేతుపల్లి రీ సర్వే ప్రక్రియను ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనలు, మార్గదర్శకాల ప్రకారం పూర్తిస్థాయి పారదర్శకతతో నిర్వహించాలని జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ అధికారులను ఆదేశించారు. భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం చూపడంతో పాటు ఖచ్చితమైన భూ రికార్డుల తయారీ లక్ష్యంగా బేతుపల్లి గ్రామంలో చేపట్టిన రీ సర్వే ప్రక్రియను శుక్రవారం జిల్లా కలెక్టర్, సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్‌తో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించి అధికారులకు పలు కీలక సూచనలు చేశారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూలి, బేతుపల్లి గ్రామంలో భూ సమస్యల పరిష్కారమే ప్రధాన లక్ష్యంగా రీ సర్వే చేపడుతున్నామని తెలిపారు. ప్రతి రైతుకు రీ సర్వే ప్రక్రియపై పూర్తి అవగాహన కల్పించి, వారి సమక్షంలోనే పారదర్శకంగా సర్వే నిర్వహించాలని సూచించారు. రీ సర్వే ద్వారా భూముల విస్తీర్ణాలు, హద్దులు, యాజమాన్య వివరాలను శాస్త్రీయ పద్ధతిలో నమోదు చేసి భూ రికార్డులను ఆధునికీకరించనున్నట్లు తెలిపారు.

రీ సర్వే నిర్వహణ కోసం గ్రామంలో పది ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ తెలిపారు. ప్రతి బృందంలో ఒక సర్వేయర్‌తో పాటు ఇద్దరు జీపీవోలు పనిచేస్తారని చెప్పారు. రైతు వేదికను కేంద్రంగా ఉపయోగించుకుని అక్కడే కంప్యూటర్ వ్యవస్థ ఏర్పాటు చేసి, క్షేత్రస్థాయిలో సేకరించిన వివరాలను వెంటనే డేటా ఎంట్రీ చేయాలని ఆదేశించారు.ప్రభుత్వం జారీ చేసిన స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్ (ఎస్ఓపీ) ప్రకారం ప్రతి దశను కచ్చితంగా అమలు చేయాలని, ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా నిబంధనలను పాటించాలని అధికారులను ఆదేశించారు. గ్రామంలోని ప్రభుత్వ భూములు, రహదారులు, చెరువులు, కాలువలు, ప్రజా స్థలాలు, ప్రభుత్వ కార్యాలయాల స్థలాలను కోఆర్డినేట్లతో సహా స్పష్టంగా నమోదు చేయాలని సూచించారు. ప్రభుత్వ భూములకు సంబంధించి పంచనామాలు నిర్వహించి ఖచ్చితమైన రికార్డులు సిద్ధం చేయాలని తెలిపారు.ప్రతి బృందం రోజుకు 50 నుంచి 60 ఎకరాల వరకు రీ సర్వే పూర్తి చేయాలని, పది బృందాలు కలిసి రోజుకు సుమారు 500 నుంచి 600 ఎకరాల వరకు సర్వే నిర్వహించేలా కార్యాచరణ రూపొందించాలని కలెక్టర్ సూచించారు. ప్రతిరోజూ ఉదయం 7 గంటల నుంచే క్షేత్రస్థాయిలో పనులు ప్రారంభించి, రైతుల సమక్షంలో భూ వివరాలను నమోదు చేయాలని తెలిపారు. ప్రతి రైతు పేరు, భూ విస్తీర్ణం, సరిహద్దులు, ఇతర వివరాలను ఖచ్చితంగా నమోదు చేయడంతో పాటు ప్రతిరోజూ సర్వే పురోగతిపై నివేదికలు సమర్పించాలని ఆదేశించారు. సర్వే పూర్తయ్యే వరకు డేటా ఎంట్రీ, డిజిటల్ మ్యాప్ తయారీ ప్రక్రియ కూడా సమాంతరంగా కొనసాగాలని స్పష్టం చేశారు.రీ సర్వే వల్ల ఏ రైతు తన భూమి విస్తీర్ణాన్ని కోల్పోయే పరిస్థితి ఉండదని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ ప్రక్రియ పూర్తిగా శాస్త్రీయ విధానంలో, పారదర్శకంగా జరుగుతుందని రైతులు అపోహలకు గురికావద్దని సూచించారు. గ్రామ సభలు నిర్వహించి ప్రజలకు పూర్తి అవగాహన కల్పించాలని, రెవెన్యూ గ్రామ పరిధిలోని ప్రతి రైతును గ్రామ సభలకు ఆహ్వానించి వారి అభిప్రాయాలు, సమస్యలను తెలుసుకోవాలని అధికారులకు సూచించారు.క్షేత్రస్థాయిలో అధికారులు సమన్వయంతో పనిచేసి ఎలాంటి వివాదాలకు తావులేకుండా రీ సర్వేను విజయవంతంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ ఆదేశించారు.ఈ పరిశీలనలో సత్తుపల్లి తహసీల్దార్, తిరుమలాయపాలెం తహసీల్దార్ విల్సన్, సర్వేయర్లు, రెవెన్యూ అధికారులు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## 300కు పైగా లగ్జరీ హోటల్స్‌ను మోసం..

- బస చేసి బిల్లులు చెల్లించని వృద్ధుడు అరెస్ట్

**టి మీడియా ,జూలై 3 ,రాయ్‌పూర్:**



ఒక వృద్ధుడు మూడు దశాబ్దాలుగా 300కుపైగా లగ్జరీ హోటల్స్‌లో బస చేశాడు. అయితే బిల్లులు చెల్లించకుండా పారిపోయేవాడు. చార్లెస్ సోభరాజ్ స్ఫూర్తితో ఈ మోసాలకు పాల్పడుతున్న ఆ వ్యక్తిని చివరకు పోలీసులు అరెస్ట్ చేశారు. తమిళనాడుకు చెందిన 69 ఏళ్ల బింగ్సన్ జాన్, గత 36 ఏళ్లలో దేశవ్యాప్తంగా 300కు పైగా లగ్జరీ హోటళ్లను మోసగించాడు. విదేశీ టూర్ గైడ్, ఇంగ్లీష్ టీచర్, యోగా ఇన్‌స్ట్రక్టర్‌గా హోటల్ సిబ్బందిని నమ్మించేవాడు. లగ్జరీ, ప్రీమియం హోటల్స్‌లో విలాసవంతమైన వసతి, ఇతర సేవలు పొందిన తర్వాత బిల్లులు చెల్లించకుండా వెళ్లిపోయేవాడు. కొన్నిసార్లు హోటల్స్‌లోని వస్తువులను కూడా దొంగిలించినట్లు ఆరోపణలున్నాయి.కాగా, జూన్ 25న ఛత్తీస్‌గఢ్ రాజధాని రాయ్‌పూర్‌లోని ఫైవ్ స్టార్ హయత్ హోటల్‌లో జాన్ తాజాగా బస చేశాడు. జూన్ 27న ఉదయం వేళ చెక్ అవుట్ చేయకుండానే వెళ్లిపోయాడు. రూ. 63,755 బిల్లు చెల్లించకపోవడంతో పాటు అతడి అభ్యర్థన మేరకు హోటల్ సిబ్బంది ఇచ్చిన రూ.1.48 లక్షల విలువైన ల్యాప్‌టాప్‌ను కూడా తన వెంట తీసుకెళ్లాడు. హోటల్ సిబ్బంది జాన్‌ను సంప్రదించేందుకు ప్రయత్నించి విఫలయ్యారు. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు.మరోవైపు రాయ్‌పూర్ పోలీసులు జాన్‌పై పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. ఒడిశా రాజధాని భువనేశ్వర్‌లో నిందితుడు ఉన్నట్లు సాంకేతిక ఆధారాలతో గుర్తించారు. అక్కడకు వెళ్లి జాన్‌ను అరెస్ట్ చేశారు. హోటల్‌కు చెందిన ల్యాప్‌టాప్‌ను అతడి నుంచి స్వాధీనం చేసుకున్నారు.అయితే రాయ్‌పూర్ పోలీసులు జాన్‌ను ప్రశ్నించగా షాకింగ్ విషయాలు వెల్లడించాడు. సీరియల్ కిల్లర్ చార్లెస్ శోభరాజ్ స్ఫూర్తితో విలాసవంతమైన హోటల్స్‌ను లక్ష్యంగా చేసుకున్నట్లు తెలిపాడు. 1990 నుంచి దేశవ్యాప్తంగా 300కు పైగా హోటల్స్‌లో బస చేసి బిల్లులు చెల్లించకుండా మోసగించినట్లు చెప్పాడు. ఇది తెలుసుకుని పోలీసులు షాక్ అయ్యారు.దేశంలోని పలు మహా నగరాలతో సహా 10కు పైగా రాష్ట్రాల్లో జాన్‌పై క్రిమినల్ కేసులు నమోదయ్యాయని పోలీస్ అధికారి తెలిపారు. తీహార్ జైలుతో సహా పలు జైళ్లలో 15 ఏళ్లకు పైగా అతడు ఉన్నట్లు చెప్పాడు. పలువురు నేరస్థులతో పరిచయాలు కూడా జాన్ ఏర్పరచుకున్నట్లు దర్యాప్తులో తెలిసిందన్నారు. అతడి నేరాలపై మరింతగా దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.

# జాప్యం లేకుండా భూ రీసర్వే

- రెవెన్యూ కార్యదర్శి ఆదేశాలు

**టి మీడియా ,జూలై 3 ,హైదరాబాద్ బ్యూరో:**



భూ రీసర్వే ప్రక్రియను నిర్దేశిత గడువులోగా, ఎలాంటి జాప్యం లేకుండా పారదర్శకంగా పూర్తి చేయాలని రాష్ట్ర రెవెన్యూ కార్యదర్శి భూ పరిపాలన ప్రధాన కమిషనర్ డీ.ఎస్ లోకేష్ కుమార్ స్పష్టం చేశారు. మెదక్ జిల్లా పర్యటనలో భాగంగా కలెక్టరేట్ కార్యాలయంలో వీడియో సమావేశ మందిరంలో స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ల శాఖ కమిషనర్, భూభారతి ప్రాజెక్ట్ డైరెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు, జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్, అదనపు కలెక్టర్ నగేష్, ఏడి ల్యాండ్ సర్వే కిషన్ సంబంధిత ఆర్డీవోలు, తాహాసిల్దార్లు, లైసెన్స్ సర్వేయర్లతో జిల్లాలో భూ సర్వే అమలు తీరు, భూభారతి, సాదా బైనామా , రెవిన్యూ సదస్సులు నిర్వహణ సంబంధిత అంశాలపై భూ పరిపాలన ప్రధాన కమిషనర్ డీఎస్ లోకేష్ కుమార్ సుదీర్ఘంగా చర్చించారు.

**రూ.300 కోట్ల అక్రమాస్తులు కూడబెట్టిన డీఎస్పీ భీంరెడ్డి**

**మెదక్ జిల్లాలో సర్వే పురోగతి**

ఈ సందర్భంగా భూ పరిపాలన ప్రధాన కమిషనర్ డీఎస్ లోకేష్ కుమార్ మాట్లాడుతూ.. మెదక్ జిల్లాలో 24 గ్రామాలు రీ సర్వే ఎంపికకగా 7 గ్రామాల్లో పూర్తి రీ సర్వే పూర్తి అయిందని,18 గ్రామ సభలు నిర్వహించారని తెలిపారు. మిగతా జిల్లాలతో పోలిస్తే మెదక్ జిల్లా సమర్థవంతంగా భూ సర్వే నిర్వహించడంపై హర్షం వ్యక్తం చేశారు. భూముల రీ సర్వే ప్రక్రియలో తాసిల్దార్లు ఆర్డీవోలు చిత్తశుద్ధితో వ్యవహరించాలని క్షేత్రస్థాయిలో ఎదుర్కొంటున్న అంశాలను భూ పరిపాలన నిబ నిబంధనలకు లోబడి సర్వే ప్రక్రియ వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. ఈ భూ సర్వేలో ప్రభుత్వ భూముల పరిరక్షణలో పటిష్ట చర్యలు తీసుకోవాలని, క్షేత్రస్థాయిలో సర్వే నిర్వహించేటప్పుడు దారిద్య రేఖకు దిగువన ఉన్న నిజమైన భూ లబ్ధిదారులకు న్యాయం చేసే దిశగా ఈ రీ సర్వే జరగాలని స్పష్టం చేశారు.

**కొత్త ల్యాండ్ పార్శిల్ మ్యాప్ నంబర్ల కేటాయింపు**

భూముల రీసర్వే ప్రక్రియకు సంబంధించి ఎక్విప్మెంట్స్ సరిపడా అందుబాటులో ఉంచుతామన్నారు. లైసెన్స్ సర్వేయర్లకు ల్యాండ్ పార్సిల్ మ్యాప్స్ (ఎల్పీ) భూముల సరిహద్దులు స్పష్టంగా ఉండేందుకు వీలుగా కొత్తగా ల్యాండ్ పార్శిల్ మ్యాప్ నంబర్లను కేటాయిస్తున్నట్లు తెలిపారు. వివాదాల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటూ గతంలో రికార్డుల్లో ఉన్న వ్యత్యాసాలను సరిచేస్తూ, సరిహద్దు వివాదాలను త్వరితగతిన పరిష్కరించాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన ఆదేశాలతో పటిష్ట ప్రణాళికతో ఈ సర్వే ప్రక్రియ పూర్తి నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ సేవలు, మ్యుటేషన్ ప్రక్రియలు పారదర్శకంగా, జాప్యం లేకుండా అందించాలని అన్నారు.రాష్ట్రవ్యాప్తంగా 134 గ్రామాలు సర్వే ప్రక్రియ పూర్తి అయినవని తెలిపారు. భూ సర్వే నిర్వహించేటప్పుడు గ్రామ సభలు ఏర్పాటు చేసేటప్పుడు డెడ్ లైన్ తప్పనిసరిగా పాటించాలన్నారు. గ్రామసభల తేదీలు వాయిదా వేయకూడదని స్పష్టం చేశారు. భూ సర్వేలో బౌండరీ ఫిక్సింగ్, ప్రభుత్వ భూములు గ్రామకంఠం సంబంధిత విషయాలలో పారదర్శకంగా వ్యవహరించాలన్నారు. గతంలో 1946 సంవత్సరంలో సర్వే నిర్వహించడం జరిగిందని అప్పటినుండి ఎలాంటి సర్వే జరగలేదని భూముల రి సర్వే ప్రక్రియ చేపట్టి నిజమైన భూలబ్ధిదారులకు న్యాయం చేసే దిశగా ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. లైసెన్స్ సర్వేయర్స్ కు గౌరవ వేతనం అందించే విషయంలో సుముఖత వ్యక్తం చేస్తూ వారం వారం చెల్లింపులు చేసేలా చర్యలు తీసుకోవాలని ల్యాండ్ సర్వేయర్ ఏ, డి కిషన్ ను ఆదేశించారు.

**సాదాబైనామా దరఖాస్తుల పరిశీలన**

అనంతరం సాదాబైనామ, భూభారతి పెండింగ్ దరఖాస్తులపై మండలాల వారీగా రివ్యూ నిర్వహించారు. పెండింగ్ దరఖాస్తులు కట్ ఆఫ్ డేట్ పెట్టుకుని పరిష్కరించాలన్నారు. స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ల శాఖ కమిషనర్ మరియు భూభారతి ప్రాజెక్ట్ డైరెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు మాట్లాడుతూ ..ఎంజాయ్ మెంట్ సర్వే నిర్వహణ అత్యంత పారదర్శకంగా జరగాలని గతంలో నిర్వహించే సర్వే సాధారణ ఎక్విప్మెంట్తో జరిగిందని ఇది పూర్తిగా డిజిటల్ సర్వేనని సమర్థతతో పూర్తిచేయాలని తెలిపారు. జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ మాట్లాడుతూ, రీ-సర్వే కార్యక్రమం నిర్దేశిత గడువులోగా, అత్యంత ఖచ్చితత్వంతో పూర్తి కావడానికి జిల్లా యంత్రాంగం పటిష్టమైన ప్రణాళికతో ముందుకు వెళ్తుందని, కమిషనర్ గారి ఆదేశాల మేరకు పనుల వేగాన్ని మరింత పెంచుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు,సిబ్బంది పాల్గొన్నారు.

## డీజీపీ ఆఫీసులోనే...

# అతిపెద్ద అవినీతి తిమింగలం..

- డీఎస్పీ సంకిరెడ్డి భీంరెడ్డి వద్ద విస్తుపోయేలా అక్రమాస్తులు

**టి మీడియా ,జూలై 3 ,హైదరాబాద్ బ్యూరో :**




తెలంగాణ పోలీసుశాఖలో అతిపెద్ద అవినీతి తిమింగలం ఏసీబీకి చిక్కింది. ఓ డీఎస్పీ స్థాయి అధికారి ఏకంగా రూ. 300 కోట్లకుపైగా అక్రమాస్తులు కూడబెట్టడం చూసిన ఏసీబీ అధికారుల కండ్లు బైర్లు కమ్మాయి. ఆయన అక్రమాస్తులు లెక్క కట్టేందుకు ఒకరోజు సరిపోలేదు. దీంతో ఆయన అక్రమాస్తులు ఎన్ని ఉన్నాయో తెలుసుకునేందుకు మళ్లీ శుక్రవారం రంగంలోకి దిగను న్నారు. తెలంగాణ పోలీస్ కంప్యూటర్ సర్వీసెస్ విభాగంలో డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్‌గా విధులు నిర్వహిస్తున్న సంకిరెడ్డి భీమ్‌రెడ్డిపై అవినీతి నిరోధకశాఖ గురిపెట్టింది. ఆయన తన సర్వీసు కాలంలో భారీగా అక్రమాస్తులు కూడబెట్టారనే పకా సమాచారంతో ఏసీబీ అధికారులు గురువారం ఏకకాలంలో 16 చోట్ల సోదాలు చేశారు. భీమ్‌రెడ్డి నివాసంతోపాటు బంధువులు, స్నేహితులు, బినామీల నివాసాలపై లసోదాలు చేపట్టారు.

**కానిస్టేబుల్ నుంచి డీఎస్పీ వరకూ**

పోలీస్‌శాఖలో 1989లో కానిస్టేబుల్‌గా చేరిన భీమ్‌రెడ్డి 1995లో ఎస్సైగా ఉద్యోగోన్నతి పొందారు. అనాటి నుంచి ఆయన అక్రమంగా సంపాదిస్తూనే ఉన్నారని ఏసీబీ అధికారులు చెప్తున్నారు. 2010లో ఇన్‌స్పెక్టర్‌గా ఉద్యోగోన్నతి పొందిన తర్వాత ఆయన అవినీతికి అడ్డూ అదుపు లేకుండా పోయిందని పలువురు బాధితులు చెప్తున్నారు. మొత్తం సైబరాబాద్, హైదరాబాద్ ప్రాంతాల్లోనే విధులు చేపట్టారని చెప్తున్నారు. విధులు చేపట్టిన ప్రతి చోటా అక్రమంగా సంపాదించడం, రియల్ ఎస్టేట్ వ్యాపారులను బెదిరించి ప్లాట్లు, ఫ్లాట్లూ తమ బంధువులు, స్నేహితుల పేరుమీద రిజిస్ట్రేషన్ చేయించడం అతనికి వెన్నెతో పెట్టిన విద్యగా చెప్తున్నారు. అందుకే ఆయన పేరు మీద ఒక్కటంటే ఒక్క ఆస్తి కూడా లేదని, అన్నీ బినామీల పేరుమీదే ఉన్నాయని తెలిసింది. ప్రస్తుతం 10 మంది బినామీలను గుర్తించామని, మరికొందరు కూడా వెలుగులోకి వచ్చే అవకాశం ఉందని పేర్కొన్నారు.

**బీజేపీ నేతతో బిజినెస్ వ్యవహారాలు**

భీమ్‌రెడ్డికి.. బీజేపీ నేత, మణికొండ మున్సిపాలిటీ మాజీ వైస్‌చైర్మన్ కే నరేందర్‌రెడ్డితో వ్యాపార సంబంధం ఉన్నదని ఏసీబీ వర్గాలు ధ్రువీకరిస్తున్నాయి. అక్కడ ఆయన వాంగ్మూలం తీసుకోగా.. మరికొన్ని ఆస్తులు వెలుగులోకి వచ్చినట్టు తెలిసింది. వీరిద్దరూ, మరికొందరు కలిసి బెంగళూరు, కర్ణాటకల్లో భూములు కొనుగోలు చేసినట్టు అధికారులు గుర్తించారు. రెండేండ్ల నుంచి ఫిర్యాదులు అందుతున్నా.. ఆయన పేరున ఆస్తులు ఉన్నట్టు సరైన ఆధారాలు లేక ఏసీబీ ఇన్నిరోజులు ఆగినట్టు తెలిసింది. అక్రమాస్తుల కేసుల్లో నిందితులను తక్షణం అరెస్టు చేసి, కోర్టు ముందు హాజరుపరిచే ఏసీబీ అధికారులు.. భీమ్‌రెడ్డిని ఎందుకు అరెస్టు చేయలేదో చెప్పాలని బీఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ ఎక్స్ వేదికగా ప్రశ్నించారు.

సోదాల్లో లభించిన ఆస్తులకు సంబంధించిన పత్రాలు

1)హైదరాబాద్ ఇబ్రహీంబాగ్‌లోని వెస్సెల్లా మెడోస్‌లో ఒక విల్లా.
2) టెలికాంనగర్‌లో జీ+2 పెంట్ హౌస్ గల నివాస భవనం.
3) టెలికాం నగర్‌లోని సాయి ప్రభా రెసిడెన్సీలో ఒక ఫ్లాట్.
4) గచ్చిబౌలిలోని క్రాంతి సియోన్ అపార్ట్‌మెంట్స్‌లో ఒక ఫ్లాట్.
5) మణికొండ లాంకో హిల్స్ రోడ్డులో 500 చదరపు గజాల జీ+5 వాణిజ్య సముదాయంలో వాటా.
6) మణికొండ మర్రిచెట్టు జంక్షన్‌లో 3వేల చదరపు అడుగుల వాణిజ్య స్థలం.
7) తెల్లాపూర్‌లోని అభినంద రెసిడెన్సీలో రెండు ఫ్లాట్లు.
8) ప్రగతి రిసార్ట్స్ వద్ద 500 చదరపు గజాల ఖాళీ స్థలం.
9) సంగారెడ్డి జిల్లా జహీరాబాద్‌లో 3.5 ఎకరాల వ్యవసాయ భూమి.
10) కర్ణాటకలో ఆరెకరాల వ్యవసాయ భూమి.
11) కర్ణాటకలోనే మరో 38 ఎకరాల వ్యవసాయ భూమి.
12) దేవనహళ్లిలో ఎకరం భూమి
13) నాగోల్‌లో కామినేని దవాఖాన సమీపంలో 200 చదరపు గజాల స్థలం.
14) పటాన్‌చెరులో జీపీఆర్ హౌసింగ్ సొసైటీ వద్ద 400 చదరపు గజాల స్థలం.
15) పటాన్‌చెరులో 200 చదరపు గజాల మరో స్థలం.
16) వికారాబాద్ జిల్లా మోమిన్‌పేటలో 1,000 చదరపు గజాల భూమి.
17) మోమిన్‌పేటలో 2 ఎకరాల వ్యవసాయ భూమి.
18) రాఘవేంద్ర రాక్‌సాండ్ మినరల్స్ సంస్థలో రూ.75 లక్షల పెట్టుబడి.
19) రంగారెడ్డి జిల్లా ముచ్చింతల్‌లో 4.20 ఎకరాల వ్యవసాయ భూమి.
20) ఇంట్లో రూ.3.60 లక్షల నగదు
21) ఆయన బినామీ నివాసంలో రూ.40 లక్షల నగదు స్వాధీనం
22) సుమారు 2 కిలోల బంగారు ఆభరణాలు స్వాధీనం
23) సుమారు 20 కిలోల వెండి వస్తువులు స్వాధీనం
24) సుమారు రూ.19.91 లక్షల బ్యాంకు నిల్వలు గుర్తింపు
26) విదేశీ మద్యం బాటిళ్లు 23

## లక్షన్నర హెక్టార్లలో బంగారు ఖనిజ నిక్షేపాలు

- నాలుగు దశల్లో అన్వేషణ

**టి మీడియా ,జూలై 3, అమరావతి బ్యూరో :**



రాష్ట్రంలో 14 ప్రాంతాల్లో లక్షా 58 వేల హెక్టార్లలో బంగారు నిక్షేపాలు ఉండే అవకాశం ఉందని నిపుణులు అంచనా వేస్తున్నారు. కర్నూలు జిల్లా జొన్నగిరిలో ఇప్పటికే బంగారం ఖనిజాల తవ్వకాలు, బంగారం ఉత్పత్తి మొదలవగా సత్యసాయి, అన్నమయ్య, చిత్తూరు, అనంతపురం, ప్రకాశం జిల్లాల్లోనూ ఖనిజాన్వేషణ చేస్తున్నారు. జాతీయ ఖనిజాన్వేషణ అభివృద్ధి ట్రస్ట్ నిధులతో ప్రక్రియ వేగవంతం చేశారు.

**ఎ-ఎఫ్ బ్లాకులు**

కర్నూలు జిల్లా జొన్నగిరిలో జియో మైసూర్ సంస్థ బంగారం ఉత్పత్తిని ప్రారభించిన వేళ మరికొన్ని ప్రాంతాల్లో బంగారం ఖనిజాన్వేషణ ప్రక్రియను వేగవంతం చేయాలని గనుల శాఖ నిర్ణయించింది. సత్యసాయి జిల్లా నంబల పూలకుంట మండలం జౌకుల గ్రామ పరిధిలో వెయ్యి హెక్టార్లు చొప్పున ఎ, బి, సి, డి, ఇ, ఎఫ్, బ్లాక్‌లుగా విభజించారు. ఇందులో ఎ బ్లాక్‌లో క్రిటికల్ మినరల్ ట్రాకర్స్, బి, లో జెమ్‌కో కటి ఎక్స్‌ప్లొపరేషన్, సి లో భుష్లిప్ మైన్స్ అండ్ మినరల్స్, డి లో జెమ్స్ ప్రాజెక్ట్స్, ఇ బ్లాక్‌లో జియో ఎక్స్‌పోర్ సంస్థలు ఖనిజాన్వేషణ చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం సమ్మతి తెలిపింది. ఎఫ్ -బ్లాక్ స్థలంలో కొంతభాగం మెగా సోలార్ పార్క్‌కు కేటాయించడంతో ప్రస్తుతానికి అందులో అన్వేషణ చేయటం లేదు.


**ఆంధ్రా మైనింగ్ కార్పొరేషన్**

సత్యసాయి జిల్లా రామగిరిలో గతంలో భారత్ గోల్డ్‌మైన్స్ లిమిటెడ్ -బీజీఎంఎల్ గనులు ఉండేవి. ఇప్పుడు వాటికి ఆనుకునే రెండు వేల హెక్టార్లను ఉత్తర, దక్షిణ బ్లాక్స్‌గా విభజించారు. వీటిలో ఖనిజాన్వేషణకు గతంలో ముంబయికి చెందిన ఆంధ్రా మైనింగ్ కార్పొరేషన్ ముందుకు వచ్చింది. రొద్దం మండలం బొక్సంపల్లి ఉత్తర, దక్షిణ బ్లాక్స్‌లో 17వందల 40 హెక్టార్లు బంగారు నిల్వలు ఉంటాయని గుర్తించగా తాజాగా అక్కడ జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా జీ-3 దశలో ఖనిజాన్వేషణ చేపట్టింది.

## 'బిగ్‌బాస్ షోలా కాంగ్రెస్, బీఆర్ఎస్ డ్రామాలు

- ప్రజలు డబుల్ ఎలిమినేషన్ కోరుకుంటున్నారు'
- బీజేపీ ఎంపీ బండి సంజయ్

**టి మీడియా ,జూలై 3 ,హైదరాబాద్ బ్యూరో :**



బీఆర్ఎస్, కాంగ్రెస్ నాయకుల నాటకాలు చూస్తుంటే ప్రజలు నవ్వుకుంటున్నారని కేంద్రమంత్రి, బీజేపీ ఎంపీ బండి సంజయ్ విమర్శించారు. ఆ రెండు పార్టీ నేతల నాయకులు ముందుకొస్తే బీజేపీ చర్చా వేదికను ఏర్పాటు చేసేందుకు సిద్ధమని ప్రకటించారు. గురుకులాల టెండర్లు, అప్పులతో పాటు అవినీతి, అక్రమాలపైనా చర్చిద్దాం రావాలని సవాల్ విసిరారు. ఇరు పార్టీల నేతలు చేస్తున్న డ్రామాలు చూస్తుంటే బిగ్? బాస్ షో?ను తలపిస్తోందని ఎద్దేవా చేశారు. వారం ముందే రిహార్సల్? చేసి, పోటాపోటీగా నటనలో జీవిస్తున్నారని, అబద్ధాలు చెప్పడంలో ఆస్కార్? అవార్డు ఇస్తే ఇద్దరూ అర్హులవుతారని బండి సంజయ్? విమర్శించారు. ఈ నేతల డ్రామాలు చూస్తున్న తెలంగాణ ప్రజలేమైనా ఎడ్డోళ్లనుకుంటున్నారా? అని సంజయ్ ఘాటుగా వ్యాఖ్యానించారు.

**ఇలానే చేస్తే ఛీ కొట్టడం ఖాయం**

కాంగ్రెస్, బీఆర్ఎస్ పాలనా వైఫల్యాలను, ప్రజల ముందుంచేందుకు బీజేపీ ఎల్లప్పుడూ సిద్ధంగా ఉందంటూ కేంద్రమంత్రి సవాల్? విసిరారు. అలాగే కేంద్రంలోని మోదీ ప్రభుత్వం తెలంగాణ అభివృద్ధికి ఖర్చు చేసిన నిధులు, అందించిన సంక్షేమ కార్యక్రమాలపై కూడా చర్చించవచ్చని స్పష్టం చేశారు. నాయకులు ఇలాగే డ్రామాలాడితే జనం ఛీ కొట్టడం ఖాయమని హెచ్చరించారు. ఈ రాజకీయ బిగ్ బాస్ షోలో ప్రజలు డబుల్ ఎలిమినేషన్ కోరుకుంటున్నారని, తెలంగాణలోనూ డబుల్ ఇంజిన్ సర్కార్ రావాలని ఆకాంక్షిస్తున్నారని స్పష్టం చేశారు. ఇరు పార్టీల తీరును ఎండగట్టిన కేంద్రమంత్రి బండి సంజయ్, ఈ మేరకు ఎక్స్? వేదికగా ట్వీట్? చేశారు.